వైద్య సంపద అద్భుత సృష్టి

మైసూరు, న్యూస్‌టుడే : చారిత్రకంగా 'వందేళ్ల' మననతను సొంతం చేసుకున్న మైసూరు వైద్య కళాశాల ఇప్పటి వరకు తొమ్మిది వేల మంది వైద్యులను ప్రపంచానికి అందించిందని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రకటించారు. మనిషి జీవితకాలాన్ని పెంచడంలో వైద్యులు, పరిశోధకుల ప్రయత్నాలు అమూల్యమని ప్రశంసించారు. మైసూరు వైద్య కళాశాల, పరిశోధన సంస్థ శతమానోత్సవాలను శనివారం ప్రారంభించారు. ఉత్తమ సేవలందించిన సీనియరు వైద్యులను సత్కరించి, నూరేళ్ల లాంఛనాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ప్రైవేటు ఆసుపత్రులతో పోల్చితే ప్రభుత్వ ఆసుపత్రుల్లోని వైద్యులకే ఎక్కువ అనుభవం ఉంటుందన్నారు. పేదలే ఎక్కువగా వచ్చే ప్రభుత్వ ఆసుపత్రిలోని వైద్యులు వారితో సౌమ్యంగా వ్యవహరించాలని సూచించారు. వ్యాధి వచ్చిన అనంతరం చికిత్స చేయడంతో పాటు, రోగాలు విస్తరించకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై జాగృతి కల్పించాలని పిలుపునిచ్చారు. వైద్యులు ఈ సమాజపు ఆస్తి అని ప్రకటించారు. మైసూరు వైద్య కళాశాల, ఆసుపత్రితో తనకు చక్కని అనుబంధం ఉందని గతాన్ని గుర్తు చేసుకున్నారు. మంత్రులు మహదేవప్ప, శరణ ప్రకాశ్ పాటిల్, ఎమ్మెల్యేలు తన్వీర్ సేఠ్, హరీశ్ గౌడ, డాక్టర్ శ్రీనివాస్, ఎమ్మెల్సీ డాక్టర్ తిమ్మయ్య, సీనియరు ఐపీఎస్ అధికారి బోరలింగయ్య తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.


సత్కారం అందుకున్న సీనియరు వైద్యులతో సీఎం సిద్ధు, చట్టసభ ప్రతినిధులు

కేసుల కలకలం

● ఒక్కొక్కరుగా విచారణ బాట
● అన్ని పార్టీలకూ అవినీతి మరక

నేతల కలవరం


కేసుల ప్రతులతో సిద్ధు కుస్తీ


నిర్మలమ్మపై 'వసూళ్ల' ఆరోపణ


కుమార 'డీ' నోటిఫికేషన్లు


ఈడీ ఉచ్చులో నాగేంద్ర


నిండా మునిగిన మునిరత్న

ఈనాడు, బెంగళూరు : రాష్ట్రం.. కొద్ది రోజులుగా కేసులు, అవినీతి ఆరోపణలు, పోలీసుల విచారణ, నేతల రాజీనామాల డిమాండ్లతో హోరెత్తుతోంది. ఏ క్షణంలో ఎవరి ఇంటికి పోలీసుల నోటీసులు వస్తాయో తెలియక బెంబేలెత్తిపోతున్నారు. అధికార, విపక్షాలతో పాటు జాతీయ స్థాయి నేతలపైనా కేసులు నమోదు చేస్తున్న రాష్ట్ర పోలీసులకు ప్రస్తుతం చేతినిండా పని దొరికినట్లైంది. ముఖ్యమంత్రులు, కేంద్రమంత్రులు, మాజీ మంత్రులు, పార్టీల అధ్యక్షులు.. ఇలా అన్ని స్థాయిల నేతలపైనా కోర్టుల్లో విచారణలు, ఆదేశాలు, కేసులు వరుసబెట్టి నమోదవుతున్నాయి. ఎంతటి హోదా ఉన్నవారైనా సమాచార హక్కు చట్టాలకు దొరికిపోతూ పోలీసు స్టేషన్లకు అతిథులవుతున్నారు. ఈ నేతలకు బంధుప్రీతి తోడై బంధువులూ చట్టాల చట్రానికి బందీలవుతున్నారు.

ఎవరైనా ఒక్కటే: సమాచార హక్కు చట్టం ఎంత బలమైనదో ప్రస్తుతం రాష్ట్ర రాజకీయ నేతలకు తెలిసొస్తోంది. ఫిర్యాదు చేసే వ్యక్తి ఎంత స్థాయి వ్యక్తి అయినా ఏమాత్రం బెదరకుండా సామాన్యులు సైతం కోర్టులో ఫిర్యాదు చేయగలుగుతున్నారు. కొందరైతే ఏకంగా రాజభవన్‌కు వెళ్లి మరీ ముఖ్యమంత్రి వంటి వ్యక్తులపై స్వేచ్ఛగా ఫిర్యాదు చేసి కోర్టుల్లో సవాలు చేసి విజయం సాధిస్తున్నారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య వంటి రాజకీయ కురువృద్ధుడికి ముచ్చెమటలు పట్టిస్తున్న స్నేహమయి కృష్ణ ఓ సాధారణ సహచట్టం కార్యకర్త. నేడు ఆయన చేసిన ఫిర్యాదు ముఖ్యమంత్రికే కాదు ఆయన సతీమణి, బావమరది జీవితాల్లో చెరగని భయం పుట్టిస్తోంది. లోకాయుక్త ఎస్పీ స్థాయి వ్యక్తులనూ ఆయన సులువుగా ఎదుర్కొని సీబీఐ వరకు వెళ్లగలగుతున్నారు. మరోవైపు ప్రపంచ అత్యంత శక్తిమంతమైన వందమంది మహిళల్లో ఒకరు, ఇందిరాగాంధీ తర్వాత రక్షణశాఖ నిర్వహించిన మహిళ, అత్యధిక సార్లు కేంద్ర బడ్జెట్‌ను సిద్ధం చేసిన వనిత నిర్మలా సీతారామన్‌పై కేసు నమోదయ్యిందంటే అది ఓ సామాన్యుడైన వ్యక్తి ఆదర్శ్ అయ్యర్ సాహస ఫలితమే. ఆమెతో పాటు భాజపా జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, రాష్ట్ర అధ్యక్షుడు బి.వై.విజయేంద్రలతో పాటు ఈడీ స్థాయి అధికారులు పోలీసుల నోటీసులు అందుకునేందుకు సిద్ధంగా ఉన్నారు. వీరిపై ఫిర్యాదు చేసే ముందు అయ్యర్ చేసిన శ్రమ అంతా ఇంతా కాదు. తనకున్న సమాచార హక్కు అవగాహన ఆసరాతో ఆయన 15కుపైగా కార్పొరేట్ సంస్థలను సందర్శించి దాదాపు రెండేళ్ల పాటు ఎన్నికల బాండ్ల వసూళ్లపై అధ్యయనం చేశారు. ఈ దందాపై ఇప్పటికే సుప్రీంకోర్టు భాజపా తీరును తప్పుపట్టినా రాష్ట్రంలో నమోదైన కేసు కేంద్ర ప్రభుత్వానికి ఎదురుదెబ్బేనని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. మాజీ ముఖ్యమంత్రులు కుమారస్వామి, బి.ఎస్. యడియూరప్పపై నమోదైన గంగేనహళ్లి డీ-నోటిఫికేషన్ కేసు వెనుక సమాచార హక్కు కార్యకర్తల శ్రమ ఉంది. మాజీ మంత్రులు బి.నాగేంద్ర కేసులో ఎస్ఐటీ అధికారులు, మునిరత్న కేసులో ఓ సాధారణ కాంట్రాక్టరు, బాధిత మహిళలు కీలకంగా మారారు.

నేతలు	స్థాయి	కేసులు
సిద్ధరామయ్య	ముఖ్యమంత్రి	ముడా అక్రమాలతో లోకాయుక్త కేసు
నిర్మలా సీతారామన్	కేంద్ర ఆర్థికమంత్రి	ఎన్నికల బాండ్ల వసూళ్ల కేసు
కుమారస్వామి	కేంద్ర భారీ పరిశ్రమల మంత్రి	డీనోటిఫికేషన్‌పై లోకాయుక్త కేసు
బి.ఎస్. యడియూరప్ప	మాజీ ముఖ్యమంత్రి	పోక్సో, డీనోటిఫికేషన్ కేసులు
బి. నాగేంద్ర	మాజీ మంత్రి	వాల్మీకి గిరిజన సంక్షేమమండలి నిధుల దుర్వినియోగం
మునిరత్న	మాజీ మంత్రి	మహిళలపై అత్యాచారం, అట్రాసిటీ కేసులు

రాజీనామా.. ఓ డ్రామా: నిన్నటి వరకు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య విచారణ సహేతుకమని కోర్టు తీర్పు రాగానే ఆయన రాజీనామాపై డిమాండ్లు వెల్లువెత్తాయి. ఆ తర్వాత కేసు నమోదవగా ఈ డిమాండ్లు మరింత రెట్టించాయి. శనివారం నాటికి ఆ డిమాండ్లు కాస్త తగ్గాయి. అందుకు కారణం.. కేంద్ర మంత్రులు, భాజపా ప్రముఖులపై కేసులే. ముఖ్యమంత్రి రాజీనామా కోసం ఆందోళన బాటపట్టిన భాజపాకు వారి కేంద్ర మంత్రులపై కేసులు డోలాయమానంలో పడేయగా.. కుమారస్వామిపై కేసులు జేడీఎస్ నేతలకు కళ్లెం వేస్తున్నాయి. ముందు నిర్మలా సీతారామన్, కుమారస్వామి రాజీనామా చేయమనండంటూ ముఖ్యమంత్రి తెగేసి చెప్పారు. వ్యక్తిగతంగా లాభపడిన ముఖ్యమంత్రి రాజీనామా చేసి దర్యాప్తునకు సహకరించాలని విపక్షాలు మండిపడుతున్నాయి. వీరి రాజీనామా ప్రహసనం ఓ డ్రామాను తలపిస్తుండగా.. సోమవారం నుంచి కేసులు నమోదు చేసిన పోలీసులు రంగంలో దిగి ఎవరెవరికి నోటీసులు ఇస్తారో, ఎవరిని అదుపులోనికి తీసుకుంటారోనని ప్రజలంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

ఆయన.. పుష్పార్చన చేయకూడదు

మైసూరు, న్యూస్‌టుడే : మైసూరు నగరాభివృద్ధి సంస్థ (ముడా)లో జరిగిన అక్రమాలకు సంబంధించిన కేసులో ఏ1గా ఉన్న ముఖ్యమంత్రి సిద్ధరామయ్య విఖ్యాత దసరా ఉత్సవాల్లో భువనేశ్వరీమాతకు పుష్పార్చన చేయకూడదని సామాజిక కార్యకర్త స్నేహమయి కృష్ణ డిమాండ్ చేశారు. నేరాన్ని ఎదుర్కొంటున్న వారు ఎవరైనా ఉత్సవాలను ప్రారంభించకూడదని చెప్పారు. ముఖ్యమంత్రి ఆస్తులపై దర్యాప్తు చేయాలని ఇప్పటికే ఈడీకి కూడా లేఖ రాసి ఫిర్యాదు చేశానని చెప్పారు. అక్టోబరు 3న చాముండి బెట్టపై వృశ్చిక లగ్నంలో మైసూరు దసరా ఉత్సవాలు ప్రారంభం అవుతున్న విషయం తెలిసిందే.


స్నేహమయి కృష్ణ

చంద్రశేఖర్‌పై కేంద్రానికి లేఖ

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే : సీనియరు ఐపీఎస్ అధికారి, లోకాయుక్త ఐజీపీ చంద్రశేఖర్ పలు అక్రమాలకు పాల్పడ్డారని కేంద్ర ఉక్కు, పరిశ్రమల శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామి ఆరోపణలు గుప్పించారు. తన భార్య పేరిట రాజకాలువ భూమిని కబ్జా చేసి 38 అంతస్తుల నిర్మాణం చేపట్టారని, తనకు రూ.20 కోట్లు ఇవ్వాలని ఒక ఇన్‌స్పెక్టర్‌ను డిమాండ్ చేశారని తీవ్ర ఆరోపణలు చేశారు. తన ఆరోపణలకు సంబంధించిన కొన్ని పత్రాలను ప్రదర్శించారు. సొంత దళాన్ని ఏర్పాటు చేసుకుని అధికారులు, బిల్డర్ల నుంచి నగదు వసూళ్లకు పాల్పడ్డారని ఆరోపించారు. రెండు వేలకుపైగా ఎఫ్ఐఆర్‌లు ఉన్న విజయ్ తాతా అనే వ్యక్తితో కలిసి అక్రమ లావాదేవీలు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. హిమాచల్‌ప్రదేశ్ క్యాడర్‌కు చెందిన ఆయన కర్ణాటకలో ఎలా పని చేస్తున్నారో చెప్పాలని ప్రశ్నించారు. తనను విచారణ చేసేందుకు అనుమతి ఇవ్వాలని గవర్నర్ కార్యాలయానికి ఆ అధికారి లేఖ రాయడాన్ని కుమార తప్పుపట్టారు. గవర్నర్ కార్యాలయం నుంచి లోకాయుక్తకు వస్తున్న లేఖలు, సమాచారం బహిర్గతం అయ్యేందుకు చంద్రశేఖరే కారణమని దుయ్యబట్టారు. బెంగళూరులో శనివారం నిర్వహించిన సమావేశంలో విలేకరులతో కుమార ఈ ఆరోపణలకు దిగారు. కర్ణాటక కాంగ్రెస్ సహకారంతోనే ఆయన తన పదవిని అడ్డుపెట్టుకుని అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఇన్ని ఆరోపణలు పెట్టుకుని, నాపై డీనోటిఫికేషన్‌లో విచారణకు అవకాశం ఇవ్వాలని గవర్నర్‌కు లేఖ రాయడం సిగ్గుచేటన్నారు. ఆరోపణల నుంచి తప్పించుకునేందుకు ప్రభుత్వం తనపై తప్పుడు కేసులు నమోదు చేయించేందుకు ప్రయత్నిస్తోందని ధ్వజమెత్తారు. నేనెందుకు రాజీనామా చేయాలంటూ నిప్పులు చెరిగారు. చంద్రశేఖర్, బీకే సింగ్ తదితరులను బెంగళూరు నగర పోలీసు కమిషనర్‌ను చేస్తామంటూ కాంగ్రెస్ పార్టీ తన సొంత అవసరాలకు వాడుకుంటోందని విమర్శించారు. ఈ ప్రభుత్వం పారదర్శకంగా పని చేయడం లేదని దుయ్యబట్టారు. తన వద్ద ఉన్న అన్ని ఆధారాలనూ కేంద్ర హోం శాఖ కార్యదర్శికి పంపించి, చంద్రశేఖర్‌పై చర్యలు తీసుకోవాలని లేఖ రాస్తానని చెప్పారు. సమావేశంలో పార్టీ నాయకులు సురేశ్ బాబు, బండెప్ప కాశంపూర్, హెచ్ఎం రమేశ్ బాబు, అశ్విన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న కుమారస్వామి

అవన్నీ ఆరోపణలే

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : కేంద్ర మంత్రి హెచ్‌డీ కుమారస్వామి తనపై తప్పుడు ఆరోపణలు చేశారని లోకాయుక్త ప్రత్యేక దర్యాప్తు దళానికి నేతృత్వం వహిస్తున్న ఏడీజీపీ ముప్పా చంద్రశేఖర్ ఖండించారు. సిట్‌లో క్రైమ్ నంబరు 16/14లో నిందితునిగా ఉన్న కుమారస్వామి తనపై చేసిన ఆరోపణలకు భయపడడం లేదన్నారు. ఆయన ఎంత శక్తివంతుడైనప్పటికీ, ఉన్నత స్థానంలో ఉన్నప్పటికీ బెయిలుపై ఉన్న నిందితుడిగానే చట్టం చూస్తుందన్నారు. నాపై ఆరోపణలు చేయడం ద్వారా దర్యాప్తు చేస్తున్న అధికారులను బెదిరించి, తన గుప్పిట పెట్టుకోవాలని ప్రయత్నిస్తున్నట్లుందని ధ్వజమెత్తారు. 'పందులతో ఎప్పుడూ కుస్తీకి వెళ్లవద్దు. వెళితే మీకు బురద అంటుతుంది. పంది కూడా అదే కోరుకుంటుంది' అని జార్జ్ బెర్నార్డ్‌షా చెప్పిన వ్యాఖ్యలను పేర్కొంటూ చంద్రశేఖర్ ఓ లేఖ రాశారు. సిట్ అధికారులకు తాను రాసిన బహిరంగ లేఖను శనివారం రాత్రి విడుదల చేశారు.


ముప్పా చంద్రశేఖర్

మునిరత్న నివాసంలో తనిఖీ

బెంగళూరు (యశ్వంతపుర): అత్యాచారం, తేనెవలలతో కుట్ర, కులం పేరుతో దూషణ, గుత్తేదారులకు బెదిరింపు.. తదితర ఆరోపణలు, కేసుల నేపథ్యంలో అరెస్టైన రాజరాజేశ్వరీనగర శాసనసభ్యుడు మునిరత్న ఇంటిపై ప్రత్యేక దర్యాప్తు దళం (ఎస్ఐటీ) అధికారులు శనివారం దాడి చేశారు. వయ్యాలికావల్‌లో నివాసం, కార్యాలయంలో ఏసీపీ కవితా నేతృత్వంలో తనిఖీ చేశారు. కొన్ని కీలక పత్రాలను పరిశీలించి స్వాధీనం చేసుకున్నారు. నగరంలో మొత్తం 15 ప్రాంతాల్లో ఆధారాల కోసం గాలించారు. ప్రస్తుతం ఆయనపై కగ్గలిపుర, విధానసౌధ పోలీసులు వేర్వేరుగా కేసులు నమోదు చేశారు.

సిద్ధు రాజీనామాకు పట్టు

శివమొగ్గ, న్యూస్‌టుడే : పదవికి రాజీనామా చేసి, కోర్టు విచారణను ఎదుర్కోవాలని ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు మాజీ మంత్రి కేఎస్ ఈశ్వరప్ప పట్టుబట్టారు. విచారణ అనంతరం ఎటువంటి తప్పు చేయలేదని 'క్లీన్ చిట్' తెచ్చుకుంటే, గౌరవంగా ఉంటుందన్నారు. పదవి కన్నా.. ఎటువంటి తప్పు చేయలేదని ఆరోపణల నుంచి బయటపడవలసిన అవసరం ఉందన్నారు. తనపై లంచానికి సంబంధించిన ఆరోపణలు వచ్చినప్పుడు పదవికి రాజీనామా చేసి, క్లీన్ చిట్ తెచ్చుకున్నానని గుర్తు చేశారు.

దార్శనికతకు దర్పణం 'వికసిత్ భారత్'

ఈనాడు, బెంగళూరు : భారతీయ ఆర్థికతలో వికసిత్ భారత్ దార్శనికతకు పెద్దపీట వేశారు. ఇందులో కేవలం భారీ పరిశ్రమలే కాదు.. చిన్న, మధ్యతరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈ) కీలకం కానున్నట్లు కేంద్ర ఎంఎస్ఎంఈ సహాయమంత్రి శోభా కరంద్లాజె వివరించారు. ఆమె శనివారం భారతీయ చిన్న, మధ్యతరహా పరిశ్రమల సమాఖ్య (ఐఎస్ఎఫ్) నిర్వహించిన 'ఎనిమిది వారాల్లో ఎగుమతుల ప్రారంభం' కార్యక్రమం, ఎంఎస్ఎంఈ పారిశ్రామికవేత్తల సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారత స్వావలంబన, ఐదు ట్రిలియన్ల ఆర్థికతలో చిన్న, మధ్యతరహా పరిశ్రమల పాత్ర కీలకమన్నారు. నేడు అంతర్జాతీయ స్థాయి మార్కెట్‌లో భారతీయ చిన్నతరహా పరిశ్రమల ఉత్పత్తులు పోటీ పడుతున్నాయని వివరించారు. అమెజాన్, యూపీఎస్ వంటి ఈ-కామర్స్ వేదికల్లోనూ భారతీయ చిన్నతరహా పరిశ్రమల ఉత్పత్తులు విక్రయిస్తున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఈ ఉత్పత్తులకు బ్రాండింగ్, విక్రయ సదుపాయాలు కల్పించేందుకు ప్రోత్సహిస్తుందన్నారు. ఇదే సందర్భంగా ఐఎస్ఎఫ్ అధ్యక్షుడు వినోద్‌కుమార్ మాట్లాడుతూ ఎనిమిది నెలల్లో ఎగుమతులను ప్రారంభించే కార్యక్రమంలో చిన్నతరహా పరిశ్రమల ఉత్పత్తులు ఎదుర్కొనే మార్కెటింగ్ సమస్యలను పరిష్కరిస్తూ కేంద్ర, రాష్ట్రాలతో పాటు ప్రైవేటు సంస్థల ఎగుమతుల వ్యవస్థలపై అవగాహన కల్పిస్తామన్నారు. సదస్సులో విదేశీ వాణిజ్య శాఖ జాయింట్ డైరెక్టర్ జనరల్ డోనాఘోష్‌తో పాటు దేశ, విదేశాల ఈ-కామర్స్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. మంత్రి శోభా తన పర్యటనలో భాగంగా భారతీయ మహిళా న్యాయవాదుల సమాఖ్య నిర్వహించిన ఓ సదస్సులోనూ శనివారం పాల్గొన్నారు.



కేంద్రమంత్రికి ఐఎస్ఎఫ్ జ్ఞాపిక అందిస్తున్న వినోద్ కుమార్

పేదల కోసమే సంక్షేమ బాట

మైసూరు, న్యూస్‌టుడే : ప్రభుత్వం అమలు చేస్తున్న గ్యారంటీ పథకాలతో లబ్ధి వివరాలను ప్రజలే ప్రచారం చేయాలని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య పిలుపునిచ్చారు. కరోనా మహమ్మారి సమయంలో నరేగా, అన్నభాగ్య పథకాలే పేదలను బతికించాయని చెప్పారు. కడుపునిండా తిండి, నోటి నిండా అన్నం అని తన తల్లి ప్రతిసారీ చెప్పేదని గుర్తు చేసుకున్నారు. మైసూరు విశ్వవిద్యాలయం మానస గంగోత్రిలో శనివారం నిర్వహించిన 'గ్యారంటీ పథకాలు-పేదల సురక్షత, సంక్షేమం' అనే పుస్తకాన్ని విడుదల చేసి మాట్లాడారు. రాజ్యాంగాన్ని అమలు చేసేందుకు 1949 నంబరు 25న నిర్వహించిన సభలోని అంశాలే నా గ్యారంటీ పథకాలకు స్ఫూర్తిగా తీసుకున్నామన్నారు. సమాన అవకాశాలు లభించినప్పుడే సమసమాజ నిర్మాణం సాధ్యమని వివరించారు. బుద్ధుడు, బసవేశ్వరుడు, అంబేడ్కర్ తదితరులు నవ సమ సమాజాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు చేశారని తెలిపారు. తన చిన్నతనంలో పండగ వచ్చినప్పుడు, పొరుగింట్లో ఎవరికైనా ఆరోగ్యం పాడయితే కూడా అన్నం వండేవారని గుర్తు చేసుకున్నారు. ఉపన్యాసాలతో ఎవరి కడుపూ నిండదని తేల్చిచెప్పారు. తాను మొదటిసారిగా ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అన్నభాగ్యతో పాటు పలు పథకాలను అమలు చేయగా, ఇప్పుడు ఐదు గ్యారంటీలను తెరపైకి తెచ్చామన్నారు. ఈ పథకాలపై విపక్షాలు ఇప్పటికీ తప్పుడు ప్రచారాన్ని చేస్తున్నాయని విమర్శించారు. అన్నభాగ్య ప్రయోజనాన్ని వివరిస్తూ తీసిన 'అన్న' సినిమాను తాను చూశానని చెప్పారు. డాక్టర్ డి.శ్రీనివాస మణగళ్లి సంపాదకత్వం వహించిన తాజా పుస్తక ఆవిష్కరణ కార్యక్రమంలో మంత్రి మహదేవప్ప, గ్యారంటీ అనుష్ఠాన సమితి అధ్యక్షుడు హెచ్ఎం రేవణ్ణ, ఉపాధ్యక్షురాలు పుష్పా అమరనాథ్, కన్నడ అభివృద్ధి ప్రాధికార అధ్యక్షుడు పురుషోత్తమ బిళిమలె, ఎమ్మెల్సీ తిమ్మయ్య, నాటకకారుడు కేవై నారాయణ స్వామి, అధికారులు ఆచార్య ఎం చంద్ర పూజారి, ఆచార్య ఎన్‌కే లోకనాథ్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



గ్యారంటీ పథకాలను సద్వినియోగం చేసుకుంటామని ప్రమాణం చేయిస్తున్న సిద్ధరామయ్య

వారెప్పుడు తప్పుకుంటారో..

మైసూరు: కేంద్ర మంత్రులు హెచ్‌డీ కుమారస్వామి, నిర్మలా సీతారామన్‌లపై ఎఫ్ఐఆర్‌లు, కేసులు నమోదైన నేపథ్యంలో వారు రాజీనామా ఎప్పుడు చేస్తున్నారని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రశ్నించారు. భాజపాలో ఉన్న అవినీతిపరులపైన ప్రధానమంత్రి నరేంద్రమోదీ తీసుకున్న చర్యలు ఏమిటో విపక్ష పార్టీల ప్రతినిధులు బదులివ్వాలన్నారు. సీఎం సిద్ధు శనివారం మైసూరులో విలేకరులతో మాట్లాడారు. హరియాణా విధానసభ ఎన్నికల ప్రచార సభలో 'ముడా'లో అక్రమాలు జరిగాయని మోదీ ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ఇతర పార్టీల నుంచి భాజపాలో చేరిన వారంతా పునీతులు అవుతారా అని ప్రశ్నించారు. మణిపూర్‌లో హింసాత్మక ఘటనలపై ఒక్కసారీ మాట్లాడలేదని, అక్కడికి వెళ్లి బాధితులను పరామర్శించలేదని గుర్తు చేశారు. కేంద్ర మంత్రి కుమారస్వామి చేస్తున్న ఆరోపణలకు తాను బదులివ్వవలసిన అవసరం లేదన్నారు. న్యాయసలహాదారు పొన్నణ్ణ తనకు కావలసిన న్యాయ సలహాలు ఇస్తుంటారని, ఇప్పుడూ అదే పనిపై మైసూరు వచ్చారని తెలిపారు.



విలేకరులతో మాట్లాడుతున్న సిద్ధరామయ్య

లంచాల అడ్డుకట్టే లక్ష్యం

రామనగర, న్యూస్‌టుడే : ప్రభుత్వ పథకాలను అందుకునేందుకు ఎవరైనా లంచం అడిగితే నా చిరునామా ఇవ్వాలని ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ స్థానికులకు సూచించారు. కనకపుర తాలూకా సాతనూరులోని ప్రభుత్వ పీయూ కళాశాల ఆవరణలో శనివారం నిర్వహించిన జనస్పందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు పారదర్శకమైన పాలన అందించేందుకు తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు.

రామయ్య పాలనకు కితాబు

విజయపుర : ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు పూర్తి మద్దతు ప్రకటిస్తున్నానని భాజపా ఎమ్మెల్యే బసనగౌడ పాటిల్ యత్నాళ్ వ్యాఖ్యానించారు. అన్ని సముదాయాలకు సమన్యాయం కల్పిస్తారన్న నమ్మకం ఆయనపై ఉందన్నారు. వాల్మీకి కార్పొరేషన్‌లో జరిగిన అక్రమాలపై పాదయాత్ర చేస్తామన్నారు.



జీవనయాత్ర

ఆ చిన్నారి ఆటలను చూసి వాణిజ్యనగరి ధార్వాడ విస్తుపోయింది. ఒకప్పుడు ఎంతో పేరొందిన ఈ వీధి ప్రదర్శనలు కనమరుగైనా.. శనివారం నగర వీధుల్లో ప్రత్యక్షం కావడంతో అందరూ ఆసక్తిగా వీక్షించారు. వివిధ ప్రాంతాల్లో భిక్షాటన చేస్తూ.. ఇక్కడికి పొట్ట కూటి కోసం వచ్చి ప్రదర్శనలిస్తున్నట్లు ఆ బడుగు జీవులు వివరించారు.

\- న్యూస్‌టుడే, ధార్వాడ

వేడుకలకు చకచకా ఏర్పాట్లు

మైసూరు, న్యూస్‌టుడే : చాముండి బెట్టపై దసరా ఉత్సవాల ప్రారంభానికి చకచకా ఏర్పాట్లు చేస్తున్నారు. అక్టోబరు మూడో తేదీ ఉదయం 9.15కి సాహితీవేత్త హంప నాగరాజయ్య ప్రారంభిస్తారు. ఆ రోజు నుంచి అక్టోబరు 11 వరకు ప్యాలెస్‌లో ప్రైవేటు దర్బారును రాజవంశస్థుడు యదువీర్ కృష్ణదత్త ఒడెయరు నిర్వహిస్తారు. అక్టోబరు 12న శనివారం గజరాజుల ఊరేగింపుతో జంబూ సవారి కొనసాగిస్తారు. ఆ రోజు మధ్యాహ్నం 1.14 నుంచి 2.10 మధ్యలో నంది ధ్వజానికి పూజ చేస్తారు. సాయంత్రం 4 గంటల నుంచి విజయదశమి ఊరేగింపు, జంబూసవారి ప్రారంభమవుతుంది. సాయంత్రం ఏడు గంటలకు బన్నిమండప ఆవరణలో కాగడాల ప్రదర్శన ఉంటుంది. దీన్ని గవర్నర్ గహ్లోత్ ప్రారంభిస్తారు. మానస గంగోత్రి వర్సిటీలో నిత్యం సాయంత్రం 5 గంటల నుంచి యువ దసరా ఉత్సవాలను నిర్వహిస్తారు.


మైసూరు నగర వీధుల్లో సాధన చేస్తున్న గజరాజుల బృందం

హోటల్‌కు బెదిరింపు

బెంగళూరు (యశ్వంతపుర): రాజధాని నగరంలోని ప్రఖ్యాత తాజ్ వెస్ట్ ఎండ్ హోటల్‌లో బాంబు పెట్టామని శనివారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తులు బెదిరింపులకు పాల్పడ్డారు. విషయం తెలిసిన వెంటనే బాంబు నియంత్రణ దళం రంగంలోకిదిగి తనిఖీలు చేపట్టింది. పేలుడు పదార్థాల జాడ తెలియకపోవడంతో ఉత్తుత్తి బెదిరింపుగా అధికారులు గుర్తించారు. హోటల్ ఈ-మెయిల్‌కు ఈ బెదిరింపు సందేశం వచ్చిందని వారు వెల్లడించారు. 'హోటల్‌లో బాంబు పెట్టాం. అది ఏక్షణమైనా పేలవచ్చు' అనే ఆ హెచ్చరికపై హైగ్రౌండ్స్ పోలీసుఠాణా అధికారులు వేగంగా స్పందించారు.

శ్రీవారి సన్నిధిలో పవిత్రోత్సవాలు

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : రాజధాని నగర వయ్యాలికావల్‌లోని తిరుమల తిరుపతి దేవస్థానంలో శుద్ధి, పవిత్రోత్సవాలు కొనసాగుతున్నాయి. తిరుమల నుంచి వచ్చిన ఆగమ పండితులతో కలిసి ఇక్కడి అర్చకులు శుక్రవారం నుంచి వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సోమవారం వరకు ఈ క్రతువులు కొనసాగుతాయని ఏఈఓ పి.బాలరాజు, సూపరింటెండెంట్ జయంతి వెల్లడించారు. శనివారం ఉదయం, సాయంత్రం యాగశాల వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. ఉదయం 10.30 నుంచి 11.30 వరకు స్నపన తిరుమంజనాన్ని, రాత్రి 8.30కి శ్రీవారికి ఏకాంత సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. పవిత్రోత్సవాల్లో పాల్గొనేందుకు రూ.వెయ్యి టికెట్‌పై రోజుకు ఇద్దరిని అనుమతిస్తున్నారు. ఈ పూజలో పాల్గొన్న వారికి ఒక పెద్ద లడ్డు, వడ, పవిత్రమాలను ఇస్తున్నామని బాలరాజు తెలిపారు.


ఆలయ ప్రాంగణంలో హోమం చేస్తున్న అర్చకులు

కాంగ్రెస్ కార్యకర్తల నిరసన

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఎన్నికల వేళ బాండ్ల సేకరణ చర్యలతో అక్రమాలకు తెరలేపారని, ఆమె తక్షణమే పదవికి రాజీనామా చేయాలని బెంగళూరు రేస్‌కోర్సు రోడ్డులో కాంగ్రెస్ కార్యకర్తలు ధర్నాకు దిగారు. ఎన్నికల బాండ్లపై న్యాయస్థానం స్పందించి ఆమెకు వ్యతిరేకంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేయాలని ఆదేశించినట్లు కేపీసీసీ ప్రధాన కార్యదర్శి మనోహర్ తెలిపారు. భూ డీనోటిఫికేషన్ అక్రమాలకు సంబంధించి లోకాయుక్త విచారణ ఎదుర్కొంటున్న కేంద్ర మంత్రి కుమారస్వామి తక్షణమే పదవి నుంచి తప్పుకోవాలని పట్టుబట్టారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్యపై తప్పుడు కేసులు సరికాదని ఖండించారు.



నిర్మలా సీతారామన్, కుమారస్వామి ముఖకవచాలతో ఆందోళన

టాటా ఎలక్ట్రానిక్స్‌లో ప్రమాదం

హోసూరు సమీపంలో ఘటన



అగ్ని ప్రమాదం తరువాత ఓ విభాగం కుప్పకూలుతున్న తీరు..

హోసూరు, న్యూస్‌టుడే : ప్రముఖ టాటా సంస్థకు చెందిన- 'సెల్‌ఫోన్లకు రంగులు పూసే పరిశ్రమ శనివారం మంటల్లో చిక్కింది. తమిళనాడు రాష్ట్ర పరిధి హోసూరు సమీప తిమిజేపల్లిలో నెలకొల్పిన 'టాటా ఎలక్ట్రానిక్స్' పరిశ్రమ'లో తెల్లవారుజాము 5.30 గంటలకు రంగుల విభాగాల్లో మంటలు కనిపించాయి. కొద్ది నిమిషాల్లోనే మంటలు ఇతర విభాగాలకు వ్యాపించాయి. సమాచారం అందుకున్న కృష్ణగిరి జిల్లా కలెక్టర్ సరయు, సబ్‌కలెక్టర్ ప్రియాంక, ఎస్పీ తంగదురై అగ్నిమాపక దళాన్ని అప్రమత్తం చేసి, సంఘటన స్థలానికి చేరుకొని నష్ట నివారణకు చర్యలు తీసుకున్నారు. మంటలు ఎగిసిపడుతున్న సమయానికి ఆ పరిశ్రమలో మూడు వేల మంది కార్మికులు పనిచేస్తున్నట్లు గుర్తించారు. అందులో సింహభాగం యువతులే. అక్కడి యంత్రాంగం వేగంగా కార్మికులందరినీ వెలుపలికి వెళ్లేలా చేయడంతో ఎలాంటి ముప్పూ ఎదురుకాలేదు. మంటలు, రసాయనాలు కాలిపోతుండటంతో వెలువడిన విషవాయువు కారణంగా కొందరు కార్మికులు రహదారిపై స్పృహతప్పి పడిపోయారు. వారిని హోసూరులోని కావేరి ఆసుపత్రికి తరలించారు. మంటలను అదుపు చేయడానికి ఆరుగంటల సమయం పట్టింది. భారీగా నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనా వేసినా.. ఆ పరిమాణాన్ని నిపుణులు అంచనా వేస్తున్నారు. రంగుల విభాగం పూర్తిగా కాలిపోయి.. కప్పు కూలే స్థితికి చేరుకుంది.



హోసూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఓ కార్మికురాలిని పరామర్శిస్తున్న కలెక్టర్ సరయు



ప్రమాద వివరాలు తెలుసుకుంటున్న వేపనహళ్లి ఎమ్మెల్యే కె.పి.మునిస్వామి

ముప్పు తెచ్చిన నిప్పు రవ్వ

● పరిశ్రమలతో విరజిల్లే హోసూరు పరిసరాలు ఒక్కసారిగా ఉలికిపాటుకు గురయ్యాయి. టాటా ఎలక్ట్రానిక్స్ పరిశ్రమల్లో మంటలు ఎగసిపడుతుంటే.. అదుపు చేయడానికి శనివారం ఉదయం నుంచి అధికార యంత్రాంగంతోపాటు నిర్వాహక సంస్థ ప్రముఖులు చేసిన ప్రయత్నాలు అన్నీ ఇన్నీ కావు. పరిశ్రమలోని రంగుల విభాగంలో ఎలా మంటలు వ్యాపించాయో అంచనా వేయలేకపోతున్నా.. అక్కడ పనిచేసే కార్మికులందరూ సురక్షితంగా బయటపడటంతో కృష్ణగిరి జిల్లా యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది. హోసూరు, ధర్మపురి, కృష్ణగిరి, బెంగళూరు, రాయకోట ప్రాంతాల నుంచి కదలివచ్చిన అగ్నిమాపక దళాల కృషితో చివరికి మంటలు అదుపులోకి వచ్చాయి. హోసూరు కావేరి ఆసుపత్రిలో బాధిత కార్మికులను కలెక్టర్‌తో పాటు వేపనహళ్లి ఎమ్మెల్యే మునిస్వామి పరామర్శించారు. ఈ సంఘటనపై దర్యాప్తు చేయిస్తామని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి చక్రపాణి వెల్లడించారు.



టాటా సంస్థ పరిశ్రమ నుంచి వెలువడుతున్న మంటలు, పొగ



టాటా ఎలక్ట్రానిక్స్ పరిశ్రమ నుంచి వెలువడుతున్న దట్టమైన పొగ

కాలిపోయిన కారు

మంగళూరు, న్యూస్‌టుడే : అడ్యారు సహ్యాద్రి కళాశాల సమీపంలో శనివారం మధ్యాహ్నం విలాసవంతమైన బీఎండబ్ల్యూ కారులో మంటలు చెలరేగాయి. కారు నడుపుతున్న గురుదీప్ క్షణాల్లో కిందకు దిగి మంటలు ఆర్పేందుకు విఫలయత్నం చేశారు. దిల్లీ రిజిస్ట్రేషన్ ఉన్న కారును గురుదీప్ మంగళూరులో వినియోగించుకుంటున్నారు. కారును సర్వీసుకు తీసుకువెళుతున్న సమయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఇంజిన్‌లో షార్ట్ సర్క్యూట్‌తో ఈ ఘటన చోటు చేసుకుందని ప్రాథమిక దర్యాప్తులో గుర్తించారు.

'నాగమంగల' నిందితులకు బెయిలు


మండ్య, న్యూస్‌టుడే : నాగమంగలంలో వినాయకుని విగ్రహాన్ని నిమజ్జనానికి తీసుకెళుతున్న సమయంలో జరిగిన మత ఘర్షణల కారకులన్న ఆరోపణలతో అరెస్టయిన 55 మంది నిందితులకు మండ్య జిల్లా సెషన్స్ న్యాయస్థానం బెయిలు మంజూరు చేసింది. ఇప్పటి వరకు నిందితులు మండ్య జిల్లా కారాగారంలో ఉన్నారు. తలా రూ.1 లక్ష బాండ్, ఇద్దరి వ్యక్తిగత పూచీకత్తు ఇచ్చిన అనంతరం వీరు కారాగారం నుంచి బయటకు రానున్నారు. ఆదివారం సెలవు ఉండడంతో సోమవారం వీరు కారాగారం నుంచి విడుదలయ్యే అవకాశం ఉంది.

కుంచె కదిలింది... జీవం పోసుకుంది

చిత్రకారుడు కె.వి.కాళె ప్రతిభ



చిత్రాలు వేస్తున్న ప్రముఖ కళాకారుడు కేవీ కాళె



గ్రామీణ ముగ్గులు



ముస్తాబైన బసవణ్ణలు

బళ్లారి, న్యూస్‌టుడే: సండూరు తాలూకా ప్రకృతి అందాలకు నిలయం. అందుకే కాబోలు అక్కడ పుట్టిన వి.టి.కాళె కుటుంబం కుంచెతో ఆ రమణీయతను చిత్రాలుగా మలిచి జీవం పోసి గుర్తింపు తెచ్చుకుంది. నాడోజ పురస్కార గ్రహీత వి.టి.కాళె కుమారుడు చిత్రకారుడైన కె.వి.కాళె తండ్రి వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్నారు. ఆర్ట్‌లో మాస్టర్ డిగ్రీ చేశారు. ఆయన కుంచె నుంచి జాలువారిన ఎన్నో చిత్రాలు ప్రజల మన్నన పొందడమే కాకుండా అంతర్జాతీయ, జాతీయ స్థాయిలో ప్రదర్శనకు నోచుకున్నాయి. ఈ నెల 17 నుంచి 23 వరకు ముంబయిలోని జహంగీర్ గ్యాలరీలో జరిగిన అంతర్జాతీయ స్థాయి చిత్ర ప్రదర్శనలో 'జానపద ప్రకాశ' (ఫోక్ ఫ్లేర్) అంశంతో ఆయన గీచిన దాదాపు 30పైగా చిత్రాలు ప్రదర్శితమై అలరించాయి. జానపద కళ, గ్రామీణుల జీవితం, భావోద్వేగం, ఆనందం, గంభీరత, సంస్కృతి, సంప్రదాయాలను ఉట్టిపడేలా ఉన్న ఆ చిత్రాలను బెల్జియం, ఇంగ్లాండు, ఐర్లాండ్, అమెరికా తదితర దేశాలకు చెందిన పలువురు కొనుగోలు చేయడం విశేషం. కేవీ కాళె ఇక్కడ తన చిత్రాలను ప్రదర్శించడానికి 2016లో దరఖాస్తు చేసుకోవడం గమనార్హం.

పరిసరాల శుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న న్యాయమూర్తి విద్యాధర్, ఇతర న్యాయమూర్తులు

బళ్లారి, న్యూస్‌టుడే: మనుషులు ఆరోగ్యంగా జీవించాలంటే ఇంటితో పాటు పరిసరాలు, కార్యాలయాలను శుభ్రంగా ఉంచుకోవాలని న్యాయమూర్తి విద్యాధర్ శిరహట్టి సూచించారు. జిల్లా న్యాయసేవా ప్రాధికార సంస్థ, న్యాయవాదుల సంఘం, నగర పాలికె ఆధ్వర్యంలో అక్టోబరు 2న గాంధీ జయంతి పురస్కరించుకుని శనివారం తాళూరు రహదారిలోని కొత్త న్యాయస్థానం ఆవరణలో చేపట్టిన స్వచ్ఛ పనులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈనెల 14 నుంచి అక్టోబరు 2 వరకు జిల్లా, తాలూకా న్యాయస్థానాలు, ఆవరణల్లో స్వచ్ఛ పనులు చేపట్టడం బాగుందన్నారు. న్యాయమూర్తి సిద్ధలింగ ప్రభు మాట్లాడుతూ కార్యక్రమంలో న్యాయమూర్తులు, న్యాయవాదులు, నగర పాలికె సిబ్బంది దాదాపు వంద మందికిపైగా కోర్టు ఆవరణంతో పాటు ఉద్యానవనంలో శ్రమదానం చేయడం అభినందనీయమన్నారు. ఇకపై ప్రతి వారం స్వచ్ఛతకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. జిల్లా న్యాయసేవా ప్రాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి జస్టిస్ రాజేశ్ ఎన్.హొసమని మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నివాస ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. న్యాయమూర్తులు బి.జి.ప్రమోద, వాసుదేవ ఆర్.గుడి, ఇబ్రహీం ముజావర్, న్యాయవాదులు, నగర పాలికె సిబ్బంది వ్యర్థాలు, గడ్డి, పిచ్చి మొక్కలను తొలగించారు.



ఉద్యానవనంలో గడ్డిని తొలగిస్తూ..



న్యాయస్థానం ఆవరణలో శుభ్రం చేస్తూ..

సీఐడీకి గాడిద పాల కేసు

హొసపేటె : హొసపేటె పట్టణంలో జెన్నీ మిల్క్ పేరిట గాడిద పాల విక్రయ వంచన కేసును సీఐడీకి అప్పగించాలని ప్రభుత్వానికి ఉత్తరం రాసినట్లు విజయనగర ఎస్పీ శ్రీహరి బాబు తెలిపారు. శనివారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రూ.3 కోట్లకుపైగా మోసానికి పాల్పడినట్లు కేసు నమోదైతే, దాన్ని సీఐడీకి అప్పగించాల్సి ఉంటుందన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వానికి రెండు రోజుల క్రితం ఉత్తరం రాశామని తెలిపారు. గాడిద పాల అమ్మకం పేరిట తమను మోసం చేశారంటూ సుమారు 278 మంది బాధితులు ఫిర్యాదు ఇచ్చిన విషయం తెలిసిందేనన్నారు. సుమారు రూ.13.50 కోట్ల మేర మోసం జరిగినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలిందని ఎస్పీ వివరించారు. కేసు దర్యాప్తుతో పాటు పరారీలోని నిందితులను అరెస్టు చేయడానికి మూడు ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిలో చాలామంది ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారే ఉన్నారని ఎస్పీ వివరించారు.

వికటించిన ఇంజక్షన్

చిక్కమగళూరు, న్యూస్‌టుడే : తీవ్ర జ్వరంతో బాధపడుతున్న సోనేశ్ (7) అనే బాలునికి ఇచ్చిన ఇంజక్షన్ వికటించి మరణించిన ఘటన కెంచాపుర గ్రామంలో చోటు చేసుకుంది. అజ్జంపురలోని ప్రైవేటు క్లినిక్‌లో వైద్యుడు వరుణ్ వద్ద గత మంగళవారం నుంచి చికిత్సకు తీసుకువెళ్లేవారు. క్లినిక్‌లో ఇచ్చిన ఇంజక్షన్ వికటించి, శుక్రవారం రాత్రి బాలుడు మరణించాడు. మృతుని తండ్రి అశోక్ ఫిర్యాదుతో అజ్జంపుర ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.



బళ్లారి: మోకా ప్రభుత్వ పదవీ పూర్వ కళాశాలలో జయంత్యుత్సవం



బళ్లారి: ఐటీఐ కళాశాల క్రీడా మైదానంలో ఏఐడీఎస్‌వో సభ్యులు

భగత్‌సింగ్ కలలు నిజం చేయాలి

స్వాతంత్ర్య సమర యోధుడు, విప్లవ నాయకుడు భగత్‌సింగ్ జయంతిని శనివారం బళ్లారి, విజయనగర జిల్లాల్లో వివిధ విద్యార్థులు, ప్రజా సంఘాలు, రాజకీయ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్‌సింగ్ చిత్రపటాలను ఉంచి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ భగత్‌సింగ్ ఆదర్శాలు అనుసరణీయమని, ఆయన దేశం గురించి కన్న కలలను నిజం చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ సందర్భంగా పలు పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు క్విజ్, చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. **-న్యూస్‌టుడే బృందం**



కంప్లి: బహుమతులు అందుకున్న విద్యార్థులు



లోగో విడుదల చేస్తున్న జిల్లాధికారి, ఎస్పీ, ఎమ్మెల్యే తదితరులు

దసరా ఆచరణకు సమాయత్తం

సింధనూరు, న్యూస్‌టుడే: తాలూకాల్లో ఏటా దసరా ఉత్సవాలు ఆచరించాలన్న ప్రభుత్వ ఆదేశాల నేపథ్యంలో తక్కువ సమయం ఉన్నందున అందరూ కలిసి పనిచేస్తే పనులు పూర్తవుతాయని రాయచూరు జిల్లాధికారి కె.నితీశ్ అన్నారు. వచ్చే నెల 4 నుంచి 12 వరకు నిర్వహించనున్న దసరా వేడుకలకు సంబంధించి ఉత్సవ సమితి నగర సభలో శనివారం ఏర్పాటు చేసిన లోగో విడుదలలో ఆయన పాల్గొని మాట్లాడారు. అధికారికంగా ఏర్పాట్లన్నీ దాదాపు పూర్తయ్యాయని, ఇదో కొత్త ప్రయోగం కావడంతో విజయవంతం చేయడానికి అందరి సహకారం అవసరమన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి మెచ్చుకునేలా ఏర్పాట్లు ఉండాలన్నారు. ఎస్పీ పుట్టమాదయ్య మాట్లాడుతూ తనది మైసూరని, తొలిసారిగా సింధనూరులో అంతటి దసరా వైభవం చూడాలని ఉందన్నారు. ఉత్సవ సమితి అధ్యక్షుడు, ఎమ్మెల్యే బాదర్లి మాట్లాడుతూ ఇప్పటికే అన్ని వర్గాలతో సమావేశమై వారి సహకారం కోరినట్లు తెలిపారు. మాజీ మంత్రి నాడగౌడ, మాజీ ఎంపీ కేవీ, ఏసీ బసవణ్ణప్ప, డీఎస్పీ తళవార్, తహసీల్దారు అరుణ్, నగరసభ కమిషనర్ మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

చాముండి కొండపై నిషేధాజ్ఞలు జారీ

మైసూరు, న్యూస్‌టుడే : చారిత్రక చాముండి బెట్టపై మహిష దసరా, మండలోత్సవాలను ఆచరిస్తామని కొన్ని సంఘాలు పిలుపునిచ్చిన నేపథ్యంలో నగరం, బెట్టపై నిషేధాజ్ఞలను జారీ చేస్తూ కమిషనర్ సీమా లాట్కర్ ఆదేశాలు జారీ చేశారు. శనివారం అర్ధరాత్రి నుంచే నిషేధాజ్ఞలు అమలులోకి వచ్చాయి. సోమవారం ఉదయం ఆరు గంటల వరకు నిషేధాజ్ఞలు కొనసాగుతాయని ఆమె ప్రకటించారు. టౌన్‌హాల్ ఆవరణలో మాత్రమే మహిష మండలోత్సవాలను నిర్వహించుకునేందుకు అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు.

మెట్రో కొత్త మార్గం సిద్ధం

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : నమ్మ మెట్రో వ్యవస్థ పొడిగింపు మార్గం నాగసంద్ర- మాదావర మధ్య 3.7 కిలోమీటర్ల పొడవునా ఉపరితల వంతెనపై అక్టోబరు మొదటి వారంలో రైలు పరుగులు తీయనుంది. ఇదే వాస్తవరూపం దాల్చితే ఉత్తర- దక్షిణ కారిడార్ మార్గం పొడవు 33.6 కిలోమీటర్లకు విస్తరించనుంది. సంచార రద్దీగా ఎక్కువగా ఉండే తుమకూరు రహదారిలో ఉపరితల వంతెనపై మెట్రో రైలు సంచారం మొదలైతే రాకపోకలు మరింత సులువు కానున్నాయి. ఇప్పటికే నెల రోజులుగా ఈ రైలు ప్రయోగాత్మకంగా పరుగులు తీసింది. దీని నిర్వహణ సజావుగా ఉన్నట్లు నిపుణులు సంతృప్తి వ్యక్తం చేశారు. కేంద్ర మెట్రో రైలు సురక్షిత ప్రాధికార కమిషనర్ ఎ.ఎం.చౌదరి నేతృత్వంలోని సాంకేతిక నిపుణులు అక్టోబరు 3న నగరానికి వచ్చి మరోసారి పరీక్షించాక ప్రయాణులకు సేవలకు అనుమతిస్తారని బీఎంఆర్‌సీఎల్ అధికారులు తెలిపారు.



ఉత్తమ రెవెన్యూ అధికారిగా రాఘవేంద్రరావు

కురుగోడు తాలూకా తహసీల్దార్ రాఘవేంద్రరావు 2024 ఏడాదికి ఉత్తమ రెవెన్యూ అధికారిగా పురస్కారం అందుకున్నారు. శుక్రవారం బెంగళూరులో జరిగిన పురస్కారాల ప్రదానోత్సవంలో ఆయన రెవెన్యూ మంత్రి కృష్ణాబైరేగౌడ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. **-న్యూస్‌టుడే, బళ్లారి**

ఎఫ్‌కేసీసీఐ అధ్యక్షుడిగా బాలకృష్ణ







ఎంజీ బాలకృష్ణ, సాయిరాం ప్రసాద్, ఉమా రెడ్డి

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే : కన్నడనాట 115 సంవత్సరాల ఘన చరిత్ర సొంతం చేసుకున్న కర్ణాటక వాణిజ్య, పరిశ్రమల సమాఖ్యకు 2024-25 ఏడాదికి అధ్యక్షుడిగా ఎంజీ బాలకృష్ణ ఎన్నికయ్యారు. సీనియరు ఉపాధ్యక్షురాలిగా ఉమా రెడ్డి, ఉపాధ్యక్షుడిగా టి.సాయిరాం వ్యవహరిస్తారు. సమాఖ్య కార్యాలయంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో వీరు బాధ్యతలను చేపట్టారు. ఎంజీ బాలకృష్ణ 1989 నుంచి సొంత పరిశ్రమను నెలకొల్పి విజయాన్ని సాధించారు. 13 ఏళ్ల నుంచి సమాఖ్య ఉపాధ్యక్షుడిగా, సీనియరు ఉపాధ్యక్షుడిగా, వివిధ సమితుల్లో క్రియాశీలకంగా సేవలందించారు. సేవలు, వ్యాపారం, ఎగుమతులకు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలను అందుకున్నారు.

బిహార్ కార్మికుడి మృతి

కోలారు, న్యూస్‌టుడే : మాలూరు తాలూకా మిటగానహళ్లి గ్రామంలోని కంకర క్వారీలో శనివారం సంభవించిన ప్రమాదంలో బిహార్‌కు చెందిన కార్మికుడు రూపేశ్ (30) మరణించాడు. లోడింగ్ సమయంలో కంకర మీద పడడం, లారీ చక్రం పైనుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మరణించాడు. మాస్తి ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

భుజాలకు అరుదైన చికిత్స

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : కుర్చీ నుంచి కిందపడి తీవ్రంగా గాయపడిన అనంతపురం నివాసి (38)కి బన్నేరుఘట్ట ఫోర్టిస్ ఆసుపత్రి వైద్యులు 'హిప్ రీప్లేస్మెంట్' చికిత్స చేసి ప్రాణాలు కాపాడారు. కుర్చీలో నుంచి కిందపడిన వ్యక్తి భుజం తీవ్రంగా దెబ్బతింది. పనులు చేసుకోవడం కష్టంగా మారింది. కదలలేని పరిస్థితుల్లో తమ వద్దకు వచ్చారని ఎముకల వైద్య నిపుణుడు మోహన్ కె.పుట్టస్వామి తెలిపారు. 'అంధుడైన ఆ బాధితుడిని పరీక్షించాం. రెండు భుజాలూ దెబ్బతిన్నాయని గుర్తించాం. మధుమేహం, రక్తపోటు తదితరాలతోనూ బాధపడుతున్నారు. ఆ వ్యక్తికి హిప్ రీప్లేస్‌మెంట్ కష్టమే. నెఫ్రాలజిస్ట్, ఇంటెన్సివిస్ట్ తదితర వైద్య నిపుణుల సాయంతో శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తి చేశాం. రెండు భుజాలూ ఇపుడు చక్కగా పని చేస్తున్నాయి. ఆ వ్యక్తి ఆరోగ్యకరంగా ఉన్నాడు' అని మోహన్ వివరించారు.

బళ్ళారి

•బళ్ళారి •రాయచూరు

ముగిసిన స్వర శ్రద్ధాంజలి

పుట్టరాజ గవాయి పుణ్య స్మరణ పురస్కరించుకుని గంగావతి తాలూకాలోని హొసకేరలో అయిదు రోజులుగా జరుగుతున్న స్వర శ్రద్ధాంజలి శుక్రవారం రాత్రి ముగిసింది. వేదమూర్తి శివలింగయ్య శాస్త్రి హిరేమఠ, నాగలీకర్ దొడ్డ బసవరాజ్ గానం చేయగా, మహ్మద్ రిజ్వాన్ ముద్దాబళ్లి తబలా సహకారం అందించారు. అనంతరం అన్న సంతర్పణ ఏర్పాటు చేశారు. డాక్టర్ పండిత పుట్టరాజ కవి గవాయి యువ కళా వేదిక ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి వివిధ మఠాధీశులు సాన్నిధ్యం వహించారు. అధిక సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు. -న్యూస్‌టుడే, శ్రీరామనగరం



కారటగిలో పోషణ్ అభియాన్

కారటగి సిద్ధేశ్వర రంగ మందిరంలో శనివారం పోషణ్ అభియాన్ జరిగింది. పురసభ అధ్యక్షురాలు రేఖ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడంతో పాటు శిశువులకు అందించినప్పుడే వారు ఆరోగ్యంగా ఉంటారన్నారు. అనంతరం 25 మంది గర్భిణులకు సీమంతం, ఆరు నెలల వయసున్న 21 మంది శిశువులకు అన్న ప్రాసన నిర్వహించారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, శిశు అభివృద్ధి యోజన సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో పురసభ ఉపాధ్యక్షురాలు దేవమ్మ, సభ్యురాలు సుప్రియా అలీ, అధికారులు తదితరులు పాల్గొన్నారు. -న్యూస్‌టుడే, కారటగి



గ్రామీణుల వినూత్న నిరసన

కారటగి, న్యూస్‌టుడే: కారటగి తాలూకా చెళ్లూరు, చెళ్లూరు క్యాంపు సమీపాన నవలి వెళ్లే మార్గాన్ని బాగు చేయాలంటూ ఆ రెండు గ్రామాల ప్రజలు శనివారం వినూత్నంగా నిరసన తెలిపారు. దాదాపు 15 ఏళ్లుగా రహదారికి మరమ్మతులు చేయాలని కోరుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. రోడ్డుపై పడిన గుంతలో నిలబడిన వర్షపు నీటిలో వరి నాట్లు వేసి నిరసన తెలిపారు. మోకాలి లోతు గుంతలున్న రహదారిపై ఇటీవల కురిసిన వర్షాలకు నీరు నిలబడింది. ద్విచక్ర వాహనాల రాకపోలకు ఇబ్బందిగా తయారయింది. అభయహస్త కార్యక్రమంలో సమస్యను స్థానిక శాసనసభ్యుడు, జిల్లా బాధ్య మంత్రి శివరాజ్ తంగడగి దృష్టికి తెచ్చినా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే మరమ్మతులు చేపట్టకపోతే తాలూకా కేంద్రం కారటగిలో పోరాటం చేస్తామని ఆ రెండు గ్రామాల ప్రజలు హెచ్చరించారు.


చెళ్లూరు వద్ద రోడ్డుపై వరి నాట్లు వేస్తున్న ప్రజలు

తుక్కు..తుక్కు చేశారు

● తుప్పు వాహనాలను అమ్మని వైనం ● నగర పాలికె యంత్రాంగం నిర్లక్ష్యం


అధ్వానంగా మారిన వాహనాలు

బళ్లారి, న్యూస్‌టుడే: నగర పాలికె పరిధిలో వ్యర్థాలు, చెత్తాచెదారం తరలించే వాహనాలతో పాటు రహదారులపై దుమ్ము, ధూళిని శుభ్రం చేసే రోడ్ సీపర్, కంప్రెసర్, చిన్న, పెద్ద ట్రాక్టర్లు, తాగునీటి ట్యాంకర్లు తదితరాల్లో కాలం చెల్లిన వాటిని అధికారులు డంపింగ్‌యార్డులో ఓ మూలన పడేశారు. నిర్దిష్ట సమయంలో వాటిని వ్యర్థాల కింద విక్రయించక పోవడంతో పాలికె ఆదాయం కోల్పోయింది. ప్రస్తుతం అవి తుక్కు, తుక్కుగా మారడంతో ఎందుకూ కొరగాకుండా పోయాయి. లక్షలాది రూపాయల విలువచేసే దాదాపు 38పైగా వివిధ రకాల వాహనాల చుట్టూ గడ్డి, ముళ్ల పొదలు, గుబురుపొదలు పెరిగిపోయి కనిపించని పరిస్థితి నెలకొంది. నగర పాలికెలో ఇంటింటా వ్యర్థాలు సేకరించే ఆటోలు, టిప్పర్లు తదితర వాహనాలకు కాలం చెల్లింది. ఈ నేపథ్యంలో వాటిని డంపింగ్‌యార్డులో ఓ మూల పడేశారు. అధికారుల నిర్లక్ష్యంతో సరైన సమయంలో స్క్రాప్‌కు పంపకపోవడంతో ఎండకు ఎండి, వర్షానికి తడిచి తుప్పుపట్టాయి. వాటి అమ్మకానికి నిర్దిష్ట సమయంలో వేలం వేసి ఉంటే ఎంతోకొంత పాలికెకు ఆదాయం వచ్చేది. ప్రస్తుతం స్క్రాప్‌కు పంపినా అతి తక్కువ మొత్తం వస్తుందని పాలికెలోని కొందరు అధికారులు సెలవిస్తున్నారంటే నిర్లక్ష్యం ఎంతలా వేళ్లూనుకుందో తెలుస్తుంది. ఇప్పటికైనా పాలికె ఉన్నతాధికారులు స్పందించి కాలం చెల్లిన వాహనాలను తుక్కు కింద అమ్మాలని నగర వాసులు కోరుతున్నారు.


చుట్టూ పెరిగిన గుబురుపొదలు


దుస్థితికి చేరిన స్వీపర్ వాహనం

ముగిసిన సీపీఎం సమ్మేళనం

బళ్లారి, న్యూస్‌టుడే: కురుగోడు తాలూకా సీపీఎం సమ్మేళనం శనివారం పార్టీ కార్యాలయంలో జరిగింది. జిల్లా కార్యదర్శి మండలి సభ్యుడు వి.ఎస్.శివశంకర్, సభ్యులు సోమప్ప, గాళి బసవరాజ, అమీన్ సాబ్, హులెప్ప, జయరామ, రామణ్ణ, మంజునాథ, శ్రీనివాస్, సుజాతమ్మ పార్టీ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా శివశంకర్ మాట్లాడుతూ అఖిల భారత సమ్మేళనం డిసెంబరు 28 నుంచి మూడు రోజుల పాటు తమిళనాడు రాష్ట్రం మధురైలో జరుగుతుందన్నారు. కార్మికులు, రైతులు, కూలీల సమస్యలపై జాతీయ స్థాయి సమ్మేళనంలో చర్చిస్తారని తెలిపారు.

మల్లదగుడ్డలో విశ్వ రేబిస్ దినోత్సవం

మాన్వి, న్యూస్‌టుడే : కుక్కలు, ఇతర జంతువులు కరిచినా, గోళ్లతో రక్కినా వెంటనే చికిత్స పొందాలని, లేని పక్షంలో అవి ప్రాణాల మీదకు తెస్తాయని తాలూకా ఆరోగ్య శిక్షణాధికారి బాలప్పనాయక్ అన్నారు. శనివారం మల్లదగుడ్డ గ్రామంలో విశ్వ రేబిస్ దినోత్సవాన్ని ప్రారంభించి మాట్లాడారు. రేబిస్ వైరస్ ద్వారా సోకుతుందన్నారు. వ్యాధి సోకిన ప్రాణుల నోటి నుంచి కారే సొంగ, అవి మనిషులను నాకడం ద్వారా రేబిస్ సోకుతుందన్నారు. కార్యక్రమంలో ప్రతినిధులు అమరేశప్ప, సూగనగౌడ, ముదుకప్ప, బసనగౌడ, వీరభద్రయ్యస్వామి, అమరయ్యస్వామి, విరుపాక్షయ్యస్వామి, శ్రీదేవి, హంపమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వర శోభాయాత్ర

జంగమరకల్లుడి (శ్రీరామనగర్), న్యూస్‌టుడే: గంగావతి తాలూకా జంగమరకల్లుడిలో శనివారం సాయంత్రం వేంకటేశ్వర స్వామి శోభాయాత్ర వైభవంగా జరిగింది. మహిళల కోలాటం, భజన బృందాలు వెంట రాగా ఆలయం నుంచి ప్రారంభమైన శోభాయాత్ర గ్రామ ప్రధాన వీధుల గుండా సాగింది. తొలుత కోదండ రామాలయ ఆవరణలో హరే శ్రీనివాస కోలాట బృందం సభ్యులు గజ్జె పూజ చేసి గురువు సతీశ్‌ను సత్కరించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణ నడుమ స్వామివారికి వివిధరకాల అభిషేకాలు చేశారు. మధ్యాహ్నం రవిచంద్ర గురూజీ ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. కల్యాణ మంటపాల నిర్మాణానికి రూ.25 లక్షలు విరాళమిచ్చిన యడ్లపల్లి మహాలక్ష్మి, శ్రీనివాసరావు దంపతులు, కమ్మ సంఘం అధ్యక్షుడు గారపాటి రామకృష్ణ, సంఘం నాయకులు చెన్నుపాటి ప్రభాకర్, సూర్య నారాయణ తదితరులను సత్కరించారు. ఆలయ సమితి అధ్యక్షుడు చిలుకూరి రామకృష్ణ, కార్యదర్శి నెక్కంటి దుర్గా ప్రసాద్, తాళూరు రామకృష్ణ, కల్యాణం కాంతారావు, యడ్లపల్లి ఆనందరావు, సుబ్రహ్మణ్యం, సుబ్బారావు, వివిధ క్యాంపుల కోలాట బృందం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.


వేదపండితుల మంత్రోచ్ఛరణ మధ్య స్వామికి అభిషేకం


ఊరేగింపుగా బయలుదేరిన స్వామి

జేడీఎస్‌కు పూర్వ వైభవమే ధ్యేయం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కరెమ్మనాయక పక్కన తాయణ్ణ, మహంతేష్ తదితరులు

బళ్లారి గ్రామీణ, న్యూస్‌టుడే: జిల్లాలో జేడీఎస్ పార్టీకి పూర్వ వైభవం తేవడమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు ఇప్పటినుంచే కృషి చేయాలని దేవదుర్గ శాసనసభ్యురాలు, బళ్లారి సభ్యత్వ నమోదు బాధ్యులు కరెమ్మ నాయక అన్నారు. శనివారం కృష్ణమాచారి రోడ్డులోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో పర్యటించి పార్టీ సభ్యత్వం, అభియాన్ చేపడతామన్నారు. ఈరోజు బళ్లారిలో సభ్యత్వం అందజేస్తున్నట్లు తెలిపారు. వచ్చే టీపీ, జడ్పీ, సండూరు ఉప ఎన్నికల్లో గెలిచేలా పార్టీని బలోపేతం చేస్తామన్నారు. త్వరలోనే కేంద్రమంత్రి కుమారస్వామి, జేడీఎస్ యువ నేత నిఖిల్ పార్టీ సంఘటన సభ నిర్వహిస్తారని చెప్పారు. సండూరు ఉప ఎన్నిక అంశంలో పార్టీ అధిష్ఠానం నిర్ణయం మేరకు నడుచుకుంటామని స్పష్టం చేశారు. సీనియర్ నాయకుడు మహంతేష్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో 3 వేలమందికి సభ్యత్వం అందజేస్తామన్నారు. సండూరు ఎన్నికల్లో పోటీకి పార్టీ తరపున టికెట్ ఇవ్వాలని కోరుతామని జిల్లా అధ్యక్షుడు మీనళ్లి తాయణ్ణ అన్నారు. అనంతరం వివిధ తాలూకాల నాయకులకు సభ్యత్వ రశీదులు అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు మైసూరు కుమారస్వామి, విజయనగర అధ్యక్షుడు కొట్రేష్, సోమప్ప, అద్దిగేరి రామణ్ణ, కిరణ్‌కుమార్, వంద్రి, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

నూతన పదాధికారుల నియామకం..

బళ్లారి గ్రామీణ, న్యూస్‌టుడే: జేడీఎస్ పురోభివృద్ధికి కార్యకర్తలు సేవలందించాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మీనళ్లి తాయణ్ణ పిలుపునిచ్చారు. పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన నూతన పదాధికారులను నియమించారు. జేడీఎస్ యువ విభాగం జిల్లా అధ్యక్షుడిగా డొనేకల్లు కిరణ్‌కుమార్, నగర అధ్యక్షుడిగా వన్నూరప్ప(వంద్రి)కు నియామక పత్రాలు అందజేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా వారిని ఘనంగా సత్కరించారు. కిరణ్‌కుమార్, వంద్రిలు మాట్లాడుతూ పార్టీ అప్పగించిన బాధ్యతలను వమ్ము చేయకుండా పనిచేస్తామన్నారు. జేడీఎస్ ఎస్టీ విభాగం అధ్యక్షుడు అద్దిగేరి రామణ్ణ, నాయకులు అసుండి నాగరాజు, న్యాయవాది యల్లనగౌడ తదితరులు పాల్గొన్నారు.



కిరణ్, వన్నూరప్పను సత్కరిస్తున్న తాయణ్ణ, రామణ్ణ తదితరులు

ఆకలి కేకలు బాధాకరం

మాన్వి, న్యూస్‌టుడే : దేశ విదేశాల్లో ఇప్పటికీ ఆకలి కేకలు వినిపించటం బాధాకరమని న్యాయమూర్తి శివరాజ్ వి సిద్ధేశ్వర పేర్కొన్నారు. తాలూకా పంచాయతీ సభాప్రాంగణంలో కానూను అరివు నెరవు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. పిల్లలు, గర్భిణులకు పోషకాహారం అందించాలన్నారు. ప్రభుత్వం అంగన్‌వాడీల ద్వారా పిల్లలు, మహిళలకు పోషక ఆహారాన్ని అందిస్తుందన్నారు. ఆకుకూరలు, పండ్లలో ఉన్న పోషకాలను తెలుసుకుని వాటిని వినియోగించుకోవాలని తెలిపారు. సమావేశంలో శిశు అభివృద్ధి యోజనాధికారి మన్సూర్ అహ్మద్, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు రవికుమార్, న్యాయవాదులు మనోహర్ విశ్వకర్మ, గుమ్మ బసవరాజ్, యల్లప్ప, దత్తాత్రేయ, ఈశప్ప, మల్లేశ్ మాచనూరు, విశ్వనాథ్ పాటిల్, మహిళా సంఘాల సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

వారానికి ఆరు రోజులు కోడిగుడ్ల పంపిణీ

చెళ్లకెర (చిత్రదుర్గం), న్యూస్‌టుడే: మొళకాల్మూరు తాలూకా రాంపురం గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో వారానికి ఆరు రోజుల పాటు విద్యార్థులకు కోడిగుడ్లు ఇస్తున్నట్లు ఎమ్మెల్యే ఎన్‌వై గోపాలకృష్ణ తెలిపారు. ఆయన శనివారం ఉదయం విద్యార్థులకు కోడిగుడ్లు, అరటి పండ్లు, వేరుసెనగ బర్ఫీ అందజేసి మాట్లాడారు. పిల్లల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం పౌష్టిక ఆహారం ఇస్తోందని చెప్పారు. విద్యార్థులు ప్రభుత్వ సదుపాయాలను సద్వినియోగం చేసుకొని బాగా చదువుకొని పైకి రావాలని కోరారు. ఈ పథకానికి అజీం ప్రేమ్‌జీ ఫౌండేషన్ చేతులు కలపడం అభినందనీయమన్నారు. కార్యక్రమానికి తహసీల్దారు టి.జగదీశ్, విద్యా శాఖ అధికారి నిర్మలాదేవి, బీఆర్‌సీ తిప్పేస్వామి తదితరులు హాజరయ్యారు.


విద్యార్థులకు కోడిగుడ్లు అందజేసే కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే గోపాలకృష్ణ

651వ రోజుకు చేరిన సత్యాగ్రహం

కుడతిని భూ పోరాట సమితి, కర్ణాటక ప్రాంత రైతు సంఘం, సీఐటీయూ జిల్లా సమితి, ప్రగతిపర సంఘాలు చేస్తున్న నిరవధిక సత్యాగ్రహం శనివారానికి 651వ రోజుకు చేరుకుంది. ఎన్ఎండీసీ ఉక్కు పరిశ్రమల కోసం ప్రభుత్వం 13 ఏళ్ల క్రితం 13,000 ఎకరాల వ్యవసాయ భూమిని తక్కువ ధరకు స్వాధీనం చేసుకోవడాన్ని వ్యతిరేకిస్తూ బాధిత రైతులు సత్యాగ్రహం చేపట్టారు. నూతన భూస్వాధీన చట్టం ప్రకారం ధర నిర్ధారించాలని, పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వాలని, భూములు తీసుకున్న రోజు నుంచి ప్రతి రైతు కుటుంబానికి నెలకు రూ.25 వేలు పరిహారం అందజేయాలని డిమాండు చేశారు. అన్నదాతల సమస్యలు పరిష్కరించే వరకు సత్యాగ్రహం కొనసాగుతుందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి తిప్పేస్వామి స్పష్టం చేశారు. నిరసన తెలిపిన వారిలో కుడతిని, వేణివీరాపురం, హరగినడోణి, జానెకుంటె, కోళగల్లు, సిద్ధమ్మనహళ్లి, యర్రంగలి గ్రామాల రైతులున్నారు. -న్యూస్‌టుడే, బళ్లారి



అఖండ బళ్లారి అభివృద్ధికి కృషి

హొసపేటె, న్యూస్‌టుడే: అఖండ బళ్లారి జిల్లా భివృద్ధికి అలుపెరగని కృషి చేస్తానని ఎంపీ ఇ.తుకారామ్ పేర్కొన్నారు. వైద్య శాఖ ఆధ్వర్యంలో హొసపేటె శివారు సండూరు బైపాస్ మార్గంలో చేపట్టనున్న అత్యవసర చికిత్స విభాగం నిర్మాణానికి శనివారం ఆయన ఎమ్మెల్యే గవియప్పతో కలిసి భూమిపూజ చేసి మాట్లాడారు. వైద్య, విద్యా రంగాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానని హామీ ఇచ్చారు. రాజకీయాల్లో ఆరోపణలు సాధారణమేనని, ఎలాంటి అవినీతి మరక అంటుకోకుండా ప్రజాసేవ చేస్తానని స్పష్టం చేశారు. కొట్టూరులో 50 పడకల ఆసుపత్రి నిర్మాణానికి త్వరలో భూమిపూజ చేయనున్నట్లు చెప్పారు. దసరా తర్వాత బళ్లారి, హొసపేటెలో ఎంపీ కార్యాలయాలు ప్రారంభిస్తామన్నారు. ఎమ్మెల్యే హెచ్.ఆర్.గవియప్ప మాట్లాడుతూ అత్యవసర చికిత్స విభాగం నిర్మాణానికి ప్రభుత్వం రూ.28.52 కోట్లు విడుదల చేసిందన్నారు. వాటితో 50 పడకల చికిత్స విభాగాన్ని నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. నియోజకవర్గం పరిధి కల్లహళ్లి, నాగేనహళ్లి, పాపినాయకనహళ్లిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నిర్మాణానికి ప్రభుత్వం సమ్మతి తెలిపిందని వివరించారు. జిల్లా వైద్యశాఖ అధికారి డాక్టర్ శంకర్ నాయక్ మాట్లాడుతూ 300 పడకల జిల్లా ఆసుపత్రి నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నట్లు తెలిపారు. జనవరిలో ఆసుపత్రి సేవలు అందుబాటులోకి తెస్తామని ధీమా వ్యక్తం చేశారు. హుడా అధ్యక్షుడు మహ్మద్ ఇమామ్ నియాజి, నగరసభ ఉపాధ్యక్షుడు రమేశ్‌గుప్తా, తాలూకా వైద్యశాఖ అధికారి డాక్టర్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



భూమిపూజలో మాట్లాడుతున్న ఎంపీ తుకారామ్

వక్కల వ్యాపారి ఆత్మహత్య

చెళ్లకెర (చిత్రదుర్గం), న్యూస్‌టుడే: వ్యాపారం కోసం చేసిన అప్పులు చెల్లించలేక వక్కల వ్యాపారి నాగరాజ్(35) తన ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన హొళల్కెరె తాలూకా హొసహళ్లి గ్రామంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. శనివారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగరాజ్ వక్కల వ్యాపారం చేసేవారు. ఈ నేపథ్యంలో శ్రీక్షేత్ర ధర్మస్థలం స్వసహాయ సంఘంతో పాటు ప్రైవేటు ఫైనాన్స్ సంస్థల్లో సుమారు రూ.8 లక్షలు రుణం తీసుకున్నారు. వ్యాపారంలో నష్టం రావడం, చేసిన రుణానికి వడ్డీలు పెరగడంతో మనస్తాపంతో ఇంటిలో ఫ్యాన్‌కు ఉరేసుకొని బలవన్మరణం పొందారు. చిక్కజాజూరు పోలీసు ఠాణాలో కేసు నమోదైంది.

హామీలను విస్మరిస్తున్న ప్రభుత్వాలు

మాన్వి, న్యూస్‌టుడే : ప్రభుత్వాలు హామీలిచ్చి విస్మరిస్తున్నాయని కర్ణాటక రాష్ట్ర గ్రామ పంచాయతీ ఉద్యోగుల సంఘం కోశాధికారి ఆర్.ఎస్.బసవరాజ్ విమర్శించారు. శనివారం స్థానిక ఈద్గా ఫంక్షన్ హాల్లో జిల్లా గ్రామ పంచాయతీ ఉద్యోగుల సంఘం జిల్లా సమ్మేళనాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలో 65 వేల మంది గ్రామ పంచాయతీల్లో విధులు నిర్వహిస్తున్నారని, ప్రజలకు సేవలందిస్తున్న వీరిని ప్రభుత్వ విస్మరించిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిత్యావసర ధరలను పెంచుతున్నాయని, అందుకు తగిన విధంగా జీతాలు పెరగడం లేదన్నారు. ప్రముఖులు మారుతి మాన్వడే, సీతారాం ఏచూరి చిత్రపటాలకు నివాళులర్పించారు. పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. రెడ్‌ఫ్లాగ్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రముఖులు ఆంజనేయనాయక్, పద్మా, శరణబసవ, హెచ్.శర్ఫుద్దీన్, గిరియప్ప, అక్తర్‌పాషా, వీరనగౌడ, సురేష్, బసవరాజ్‌గౌడ, శివరాజ్‌స్వామి, కార్మిక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.


సమ్మేళనాన్ని ప్రారంభిస్తున్న బసవరాజ్

తెరపై ఈనాడు.

ఉమ- సంజు (కన్నడ) **గంగా-** భీమ (కన్నడ) **శివ-** సత్యం సుందరం (తెలుగు), **నటరాజ్:** సరిపోదా శనివారం (తెలుగు), **రాధిక-** దేవర (తెలుగు), **రాఘవేంద్ర-** దేవర (తెలుగు), **మూవీటైమ్ మాల్ స్క్రీన్1-** దేవర (కన్నడ), **మూవీటైమ్ స్క్రీన్2-** దేవర (హిందీ), **మూవిటైమ్ స్క్రీన్3-** దేవర (తెలుగు)

-న్యూస్‌టుడే, బళ్లారి గ్రామీణ

ఉత్సాహంగా క్రీడా పోటీలు

హొసపేటె, న్యూస్‌టుడే: యువజన సేవా, క్రీడా శాఖ ఆధ్వర్యంలో హొసపేటెలోని జిల్లా క్రీడా మైదానంలో శనివారం దసరా క్రీడలు ఉత్సాహంగా మొదలయ్యాయి. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, త్రోబాల్, బాల్‌బ్యాడ్మింటన్, పరుగు పందేల్లో ఆటగాళ్లు పోటీపడ్డారు. హొసపేటె, హరపనహళ్లి, కొట్టూరు, కూడ్లిగి తాలూకాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. యువతుల వాలీబాల్ పోటీ ఉత్కంఠగా సాగింది. హొసపేటె, హరపనహళ్లి జట్లు తలపడ్డాయి. తొలుత పోటీలను నగరసభ అధ్యక్షుడు రూపేశ్‌కుమార్, సభ్యుడు తారిహళ్లి జంబయ్య ప్రారంభించారు. క్రీడా శాఖ సహాయక సంచాలకురాలు గ్రేసీ తదితరులు పాల్గొన్నారు.


హొసపేటె: వాలీబాల్‌లో తలపడుతున్న హరపనహళ్లి, హొసపేటె జట్లు

బళ్లారి, న్యూస్‌టుడే: కురుగోడు తాలూకా ఓర్వాయి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి ఖోఖో పోటీల్లో విజేతగా నిలిచి కొప్పళ జిల్లాలో జరిగే విభాగ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జిల్లా స్థాయి ఖోఖో ఫైనల్స్‌లో ఓర్వాయి, సిరుగుప్ప ప్రభుత్వ పాఠశాలల జట్లు పోటీపడ్డాయి. చివరికి ఓర్వాయి జట్టు 3-1 తేడాతో గెలిచింది. విజేత జట్టు కెప్టెన్ శాంతమ్మ, క్రీడాకారిణులు హులిగమ్మ, మహేశ్వరి, కావ్య, మంజుళ, జ్యోతి, చైత్ర, చంద్రకళ, సోని, సుప్రియా, అనూషా, కావ్య, అఖిలను క్రీడాశాఖాధికారులు, ఉపాధ్యాయులు అభినందించారు.


బళ్లారి: ఖోఖో పోటీలకు ఎంపికైన ఓర్వాయి విద్యార్థులు

తుంగభద్ర జలాశయం నీటిమట్టం

పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు

28-09-2024 (ఉ. 8 గంటలకు)	ప్రస్తుతం	గత సంవత్సరం
నీటిమట్టం (అడుగుల్లో)	1632.00	1618.79
ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	22,513	881
అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	14,408	9,549
నీటి నిల్వ (టి.ఎం.సి)	101.773	57,999

గరిష్ఠసామర్థ్యం (133 టీఎంసీలు) వాస్తవసామర్థ్యం 105.788 టీఎంసీలు

50 వేలమందికి దుస్తుల వితరణ

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి సన్మార్గ గెళెయర బళగ ఆధ్వర్యంలోని కేంద్రం ద్వారా ఐదేళ్లలో 50 వేలమందికిపైగా దుస్తులు వితరణ చేశామని బళగ అధ్యక్షుడు లక్ష్మీకాంతరెడ్డి తెలిపారు. స్థానిక దుర్గమ్మ ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సన్మార్గ గెళెయర బళగ కేంద్రానికి బళ్లారి రౌండ్ టేబుల్ సంస్థ సభ్యులు ఉపయోగించిన వందకుపైగా దుస్తులను ఆయన అందజేసి మాట్లాడారు. ఇంట్లోని పాత దుస్తులు సేకరించి నిరాశ్రయులకు ఇచ్చేందుకు సన్మార్గ గెళెయర బళగ ప్రత్యేక కేంద్రం ఏర్పాటు చేసిందని తెలిపారు. ప్రతి ఒక్కరి పేరును రికార్డులో నమోదు చేసినట్లు చెప్పారు. పాత గ్రంథాలు, వివిధ తరగతులకు చెందిన పుస్తకాలను కేంద్రంలో అందజేస్తే, వాటిని పేద విద్యార్థులకు ఇస్తామన్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు హనుమంతరెడ్డి, జగదీశ్, చంద్రశేఖర్ ఆచార్, మంజు, లక్ష్మీరెడ్డి, చంద్రశేఖర్, రౌండ్ టేబుల్ సంస్థ అధ్యక్షుడు శిరీష్, ఉపాధ్యక్షులు శెట్టి, రోహిత్‌రాజ్, శరత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



దుస్తులు అందజేస్తున్న రౌండ్ సంస్థ అధ్యక్షుడు, సభ్యులు

కనుల పండువగా సాయిబాబా జయంతి

మాన్వి, న్యూస్‌టుడే : పట్టణంలోని ఆర్‌జీక్యాంపు రోడ్డులోని శిరిడి సాయిబాబా జయంతి ఘనంగా నిర్వహించారు. తెల్లవారు జామున కాకడ హారతితో జయంత్యుత్సవ వేడుకలను ప్రారంభించారు. జాలాపూర్(శ్రీనగర్)క్యాంపునకు చెందిన ఎం.సుబ్రమణ్యం సుజాత, ఎం.శ్రీనివాస్ గీతా దంపతుల ఆధ్వర్యంలో సాయిబాబా ఉత్సవ విగ్రహాలకు అభిషేక పూజలు ఆలయ అర్చకులు సాయిప్రసాద్ పర్యవేక్షణలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మాన్వి, సిరివార తాలూకాల పరిధి క్యాంపుల నుంచి తెలుగు ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వివిధ పార్టీలకు చెందిన ప్రముఖులు, సంఘ సంస్థల నిర్వాహకులు, అధికారులు జయంత్యుత్సవానికి హాజరయ్యారు. భక్తులకు విశేష అన్నసంతర్పణ చేశారు. సాయి సేవాసమితి, తిరుమల తిరుపతి భక్తుల సేవా సమితి, ఆలయ సేవా సమితుల ఆధ్వర్యంలో భక్తులకు సేవలందించారు.


సాయిబాబా విగ్రహానికి పూజలు చేస్తున్న భక్తులు

టాటా ఎలక్ట్రానిక్స్‌లో ప్రమాదం

హోసూరు సమీపంలో ఘటన



అగ్ని ప్రమాదం తరువాత ఓ విభాగం కుప్పకూలుతున్న తీరు..

హోసూరు, న్యూస్‌టుడే : ప్రముఖ టాటా సంస్థకు చెందిన- సెల్‌ఫోన్లకు రంగులు పూసే పరిశ్రమ శనివారం మంటల్లో చిక్కింది. తమిళనాడు రాష్ట్ర పరిధి హోసూరు సమీప తిమిదేపల్లిలో నెలకొల్పిన 'టాటా ఎలక్ట్రానిక్స్ పరిశ్రమ'లో తెల్లవారుజాము 5.30 గంటలకు రంగుల విభాగంలో మంటలు కనిపించాయి. కొద్ది నిమిషాల్లోనే మంటలు ఇతర విభాగాలకు వ్యాపించాయి. సమాచారం అందుకున్న కృష్ణగిరి జిల్లా కలెక్టర్ సరయు, సబ్‌కలెక్టర్ ప్రియాంక, ఎస్పీ తంగదురై అగ్నిమాపక దళాన్ని అప్రమత్తం చేసి, సంఘటన స్థలానికి చేరుకొని నష్ట నివారణకు చర్యలు తీసుకున్నారు. మంటలు ఎగసిపడుతున్న సమయానికి ఆ పరిశ్రమలో మూడు వేల మంది కార్మికులు పనిచేస్తున్నట్లు గుర్తించారు. అందులో సింహభాగం యువతులే. అక్కడి యంత్రాంగం వేగంగా కార్మికులందరినీ వెలుపలికి వెళ్లేలా చేయడంతో ఎలాంటి ముప్పూ ఎదురుకాలేదు. మంటలు, రసాయనాలు కాలిపోతుంటే వెలువడిన విషవాయువు కారణంగా కొందరు కార్మికులు రహదారిపై స్పృహతప్పి పడిపోయారు. వారిని హోసూరులోని కావేరి ఆసుపత్రికి తరలించారు. మంటలను అదుపు చేయడానికి ఆరుగంటల సమయం పట్టింది. భారీగా నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనావేసినా.. ఆ పరిమాణంపై నిపుణులు అంచనా వేస్తున్నారు. రంగుల విభాగం పూర్తిగా కాలిపోయి.. కుప్పకూలే స్థితికి చేరుకుంది.



హోసూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఓ కార్మికురాలిని పరామర్శిస్తున్న కలెక్టర్ సరయు



ప్రమాద వివరాలు తెలుసుకుంటున్న వేపనహళ్లి ఎమ్మెల్యే కె.పి.మునిస్వామి

ముప్పు తెచ్చిన నిప్పు రవ్వ

● పరిశ్రమలతో విరాజిల్లే హోసూరు పరిసరాలు ఒక్కసారిగా ఉలికిపాటుకు గురయ్యాయి. టాటా ఎలక్ట్రానిక్స్ పరిశ్రమల్లో మంటలు ఎగసిపడుతుంటే.. అదుపు చేయడానికి శనివారం ఉదయం నుంచి అధికార యంత్రాంగంతోపాటు నిర్వాహక సంస్థ ప్రముఖులు చేసిన ప్రయత్నాలు అన్నీ ఇన్నీ కాదు. పరిశ్రమలోని రంగుల విభాగంలో ఎలా మంటలు వ్యాపించాయో అంచనా వేయలేకపోతున్నా.. అక్కడ పనిచేసే కార్మికులందరూ సురక్షితంగా బయటపడటంతో కృష్ణగిరి జిల్లా యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది. హోసూరు, ధర్మపురి, కృష్ణగిరి, బెంగళూరు, రాయకోట ప్రాంతాల నుంచి కదలివచ్చిన అగ్నిమాపక దళాల కృషితో చివరికి మంటలు అదుపులోకి వచ్చాయి. హోసూరు కావేరి ఆసుపత్రిలో బాధిత కార్మికులను కలెక్టర్‌తో పాటు వేపనహళ్లి ఎమ్మెల్యే మునిస్వామి పరామర్శించారు. ఈ సంఘటనపై దర్యాప్తు చేయిస్తామని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి చక్రపాణి వెల్లడించారు.



టాటా సంస్థ పరిశ్రమ నుంచి వెలువడుతున్న మంటలు, పొగ



టాటా ఎలక్ట్రానిక్స్ పరిశ్రమ నుంచి వెలువడుతున్న దట్టమైన పొగ

కాలిపోయిన కారు

మంగళూరు, న్యూస్‌టుడే : అడ్యారు సహ్యాద్రి కళాశాల సమీపంలో శనివారం మధ్యాహ్నం విలాసవంతమైన బీఎండబ్ల్యూ కారులో మంటలు చెలరేగాయి. కారు నడుపుతున్న గురుదీప్ తక్షణమే కిందకు దిగి మంటలు ఆర్పేందుకు విఫలయత్నం చేశారు. దిల్లీ రిజిస్ట్రేషన్ ఉన్న కారును గురుదీప్ మంగళూరులో వినియోగించుకుంటున్నారు. కారును సర్వీసుకు తీసుకువెళుతున్న సమయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఇంజిన్‌లో షార్ట్ సర్క్యూట్‌తో ఈ ఘటన చోటు చేసుకుందని ప్రాథమిక దర్యాప్తులో గుర్తించారు.

'నాగమంగల' నిందితులకు బెయిలు

మండ్య, న్యూస్‌టుడే : నాగమంగలలో వినాయకుని విగ్రహాన్ని నిమజ్జనానికి తీసుకువెళుతున్న సమయంలో జరిగిన ఘర్షణలకు కారకులన్న ఆరోపణలపై అరెస్టయిన 55 మంది నిందితులకు మండ్య జిల్లా సెషన్స్ న్యాయస్థానం బెయిలు మంజూరు చేసింది. ఇప్పటి వరకు నిందితులు మండ్య జిల్లా కారాగారంలో ఉన్నారు. తలా రూ.1 లక్ష బాండ్, ఇద్దరి వ్యక్తిగత పూచీకత్తు ఇచ్చిన అనంతరం వీరు కారాగారం నుంచి బయటకు రానున్నారు. ఆదివారం సెలవు ఉండడంతో సోమవారం వీరు కారాగారం నుంచి విడుదలయ్యే అవకాశం ఉంది.

కుంచె కదిలింది... జీవం పోసుకుంది

చిత్రకారుడు కె.వి.కాళె ప్రతిభ



చిత్రాలు వేస్తున్న ప్రముఖ కళాకారుడు కేవీ కాళె



గ్రామీణ ముగ్ధలు



ముస్తాబైన బసవణ్ణలు

బళ్లారి, న్యూస్‌టుడే: సండూరు తాలూకా ప్రకృతి అందాలకు నిలయం. అందుకే కాబోలు అక్కడ పుట్టిన వి.టి.కాళె కుటుంబం కుంచెతో ఆ రమణీయతను చిత్రాలుగా మలిచి జీవం పోసి గుర్తింపు తెచ్చుకుంది. నాడోజ పురస్కార గ్రహీత వి.టి.కాళె కుమారుడు చిత్రకారుడైన కె.వి.కాళె తండ్రి వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్నారు. ఆర్ట్స్‌లో మాస్టర్ డిగ్రీ చేశారు. ఆయన కుంచె నుంచి జాలువారిన ఎన్నో చిత్రాలు ప్రజల మన్నన పొందడమే కాకుండా అంతర్జాతీయ, జాతీయ స్థాయిలో ప్రదర్శనకు నోచుకున్నాయి. ఈ నెల 17 నుంచి 23 వరకు ముంబయిలోని జహంగీర్ గ్యాలరీలో జరిగిన అంతర్జాతీయ స్థాయి చిత్ర ప్రదర్శనలో 'జానపద ప్రకాశం' (ఫోక్ ఫ్లేర్) అంశంతో ఆయన గీచిన దాదాపు 30పైగా చిత్రాలు ప్రదర్శితమై అలరించాయి. జానపద కళ, గ్రామీణుల జీవితం, భావోద్వేగం, ఆనందం, గంభీరత, సంస్కృతి, సంప్రదాయాలను ఉట్టిపడేలా ఉన్న ఆ చిత్రాలను బెల్జియం, ఇంగ్లాండు, ఐర్లాండ్, అమెరికా తదితర దేశాలకు చెందిన పలువురు కొనుగోలు చేయడం విశేషం. కేవీ కాళె ఇక్కడ తన చిత్రాలను ప్రదర్శించడానికి 2016లో దరఖాస్తు చేసుకోవడం గమనార్హం.

మెట్రో కొత్త మార్గం సిద్ధం

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : నమ్మ మెట్రో వ్యవస్థ పొడిగింపు మార్గం నాగసంద్ర- మాదావర మధ్య 3.7 కిలోమీటర్ల పొడవునా ఉపరితల వంతెనపై అక్టోబరు మొదటి వారంలో రైలు పరుగులు తీయనుంది. ఇదే వాస్తవరూపం దాల్చితే ఉత్తర- దక్షిణ కారిడార్ మార్గం పొడవు 33.6 కిలోమీటర్లకు విస్తరించనుంది. సంచార రద్దీగా ఎక్కువగా ఉండే తుమకూరు రహదారిలో ఉపరితల వంతెనపై మెట్రో రైలు సంచారం మొదలైతే రాకపోకలు మరింత సులువు కానున్నాయి. ఇప్పటికే నెల రోజులుగా ఈ రైలు ప్రయోగాత్మకంగా పరుగులు తీసింది. దీని నిర్వహణ సజావుగా ఉన్నట్లు నిపుణులు సంతృప్తి వ్యక్తం చేశారు. కేంద్ర మెట్రో రైలు సురక్షిత ప్రాధికార కమిషనర్ ఎ.ఎం.చౌదరి నేతృత్వంలోని సాంకేతిక నిపుణులు అక్టోబరు 3న నగరానికి వచ్చి మరోసారి పరీక్షించాక ప్రయాణికుల సేవలకు అనుమతిస్తారని బీఎంఆర్‌సీఎల్ అధికారులు తెలిపారు. 2017లో నాగసంద్ర- మాదావర మధ్య మెట్రో నిర్మాణ పనులు ప్రారంభించారు. అనేక కారణాలతో పనుల్లో జాప్యం ఎదురైంది. నిర్మాణానికి రూ.248 కోట్లు వ్యయం చేశారు. మంజునాథ్‌నగర, చిక్కబిదరకల్లు, మాదావర ప్రయాణ ప్రాంగణాలు ఇందులో భాగం. బెంగళూరు అంతర్జాతీయ వస్తు ప్రదర్శనశాలకు వెళ్లే సందర్శకులకు మెట్రో రైలు అనుకూలం కానుంది. నెలమంగల, తుమకూరు ప్రాంతాలకు వేగంగా చేరుకోవడానికి ఉపకరించనుంది.



పొడిగింపు మార్గంలో సంచరిస్తున్న ఆకుపచ్చ మెట్రో రైలు

అధికారులపై నమ్మకమే లేదా!

సిద్దు తీరు తప్పుపట్టిన అశ్వత్థ



సమావేశంలో మాట్లాడుతున్న అశ్వత్థ నారాయణ

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : తాను నియమించిన ప్రధాన కార్యదర్శి, పోలీసు డైరెక్టర్ జనరల్‌పైనే ముఖ్యమంత్రికి, మంత్రులకు నమ్మకం లేదని మాజీ ఉప ముఖ్యమంత్రి, భాజపా కీలకనేత అశ్వత్థ నారాయణ ఎద్దేవా చేశారు. గవర్నర్ కార్యాలయం నుంచి ఏదైనా వివరాలు అడిగితే, నేరుగా అధికారులే బదులు ఇవ్వకూడదని మంత్రివర్గం నిర్ణయించడం సిగ్గుచేటన్నారు. పార్టీ ప్రధాన కార్యాలయం 'జగన్నాథ భవన్'లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఉన్నామనే విషయాన్ని కాంగ్రెస్ మరచిపోయి నిరంకుశ ధోరణిని అనుసరిస్తోందని ఆరోపించారు. ఉద్యోగులపై ఆరోపణలు వచ్చినప్పుడు దర్యాప్తు చేసేందుకు సీబీఐకి అధికారం ఉంటుందన్న విషయాన్ని సిద్ధరామయ్య విస్మరిస్తున్నారని విమర్శించింది. వాల్మీకి కార్పొరేషన్‌లో దర్యాప్తు కొనసాగితే మరో ఉచ్చు తనకు బిగుస్తుందన్న భయంతోనే సీబీఐ దర్యాప్తులకు అవకాశం ఇవ్వబోమని ప్రభుత్వం ప్రకటించిందని ఆరోపించారు. మైసూరు నగరాభివృద్ధి సంస్థ (ముడా)లో అక్రమాల విషయంలో నేను సత్యహరిశ్చంద్రుడినని ప్రకటించుకుంటూ వచ్చిన సిద్ధరామయ్య త్వరలో తన పదవికి రాజీనామా చేస్తారని జోస్యం చెప్పారు. న్యాయస్థానాలు తప్పుపట్టేలోగా పదవికి రాజీనామా చేసి, విచారణకు హాజరు కావాలని సూచించారు. పార్టీ నాయకులు నరేంద్ర రంగప్ప, జగదీశ్ హిరేమని తదితరులు విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు.

ఎఫ్‌కేసీసీఐ అధ్యక్షుడిగా బాలకృష్ణ



ఎంజీ బాలకృష్ణ, సాయిరాం ప్రసాద్, ఉమా రెడ్డి

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే : కన్నడనాట 115 సంవత్సరాల ఘన చరిత్ర సొంతం చేసుకున్న కర్ణాటక వాణిజ్య, పరిశ్రమల సమాఖ్యకు 2024-25 ఏడాదికి అధ్యక్షుడిగా ఎంజీ బాలకృష్ణ ఎన్నికయ్యారు. సీనియరు ఉపాధ్యక్షురాలిగా ఉమారెడ్డి, ఉపాధ్యక్షుడిగా టి.సాయిరాం వ్యవహరిస్తారు. సమాఖ్య కార్యాలయంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో వీరు బాధ్యతలను చేపట్టారు. ఎంజీ బాలకృష్ణ 1989 నుంచి సొంత పరిశ్రమను నెలకొల్పి విజయాన్ని సాధించారు. 13 ఏళ్ల నుంచి సమాఖ్య ఉపాధ్యక్షుడిగా, సీనియరు ఉపాధ్యక్షుడిగా, వివిధ సమితుల్లో క్రియాశీలకంగా సేవలందించారు. సేవలు, వ్యాపారం, ఎగుమతులకు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలను అందుకున్నారు.

ఆరోగ్య రక్షణకే హృదయ స్పందన



ఎరుపు గాలి బుడగలతో ఆసుపత్రి ప్రతినిధులు

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని ఆరోగ్య శాఖ మంత్రి దినేశ్ గుండూరావు పిలుపునిచ్చారు. ఆరోగ్యమే మహాభాగ్యం అనే విషయాన్ని ఎప్పుడూ గుర్తుంచుకోవాలని సూచించారు. ప్రపంచ హృదయ దినోత్సవాన్ని పురస్కరించుకుని, హృద్రోగాలు, ఆరోగ్యకరమైన గుండెకు సంబంధించి బెంగళూరులో శనివారం నిర్వహించిన జాగృతి కార్యక్రమాలు, వాకథాన్‌ను మాజీ మంత్రి గోపాలయ్యతో కలిసి ప్రారంభించిన దినేశ్ ప్రసంగించారు. ఆహారపు అలవాట్లలో మార్పు, నిద్రలేమి, జీవనశైలిలో మార్పులతో యువత ఇటీవలి కాలంలో గుండెపోటుకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యం వ్యాయామం, ప్రాణాయామం, పౌష్టికాహారాన్ని తీసుకోవడం పట్ల శ్రద్ధ తీసుకోవాలని యువతకు సూచించారు. రాజాజీనగర, పశ్చిమ కార్డ్ రోడ్డు, ఇస్కాన్, మహాలక్ష్మి లేఅవుట్ తదితర మార్గాల్లో వాకథాన్ కొనసాగింది. వైద్య ప్రముఖులు మహంతేశ్ చరంతిమఠ్, వివిధ సంస్థల ప్రతినిధులు జస్సి మెర్లిన్, వీణా మహంతేశ్, సవితా లక్ష్మీ బెళగలి తదితరులు వాకథాన్‌లో పాల్గొన్నారు.



జాగృతి కార్యక్రమంలో గోపాలయ్య, దినేశ్ గుండూరావులతో పాఠశాల విద్యార్థులు



ప్రజాచైతన్య నడకలో ఆసుపత్రి సిబ్బంది, విద్యార్థులు

భుజాలకు అరుదైన చికిత్స

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : కుర్చీ నుంచి కిందపడి తీవ్రంగా గాయపడిన అనంతపురం నివాసి (38)కి బన్నేరుఘట్ట ఫోర్టిస్ ఆసుపత్రి వైద్యులు 'హిప్ రీప్లేస్మెంట్' చికిత్స చేసి ప్రాణాలు కాపాడారు. కుర్చీలో నుంచి కిందపడిన వ్యక్తి భుజం తీవ్రంగా దెబ్బతింది. పనులు చేసుకోవడం కష్టంగా మారింది. కదలలేని పరిస్థితుల్లో తమ వద్దకు వచ్చారని ఎముకల వైద్య నిపుణుడు మోహన్ కె.పుట్టస్వామి తెలిపారు. 'అంధుడైన ఆ బాధితుడిని పరీక్షించాం. రెండు భుజాలూ దెబ్బతిన్నాయని గుర్తించాం. మధుమేహం, రక్తపోటు తదితరాలతోనూ బాధపడుతున్నారు. ఆ వ్యక్తికి హిప్ రీప్లేస్‌మెంట్ కష్టమే. నెఫ్రాలజిస్ట్, ఇంటెన్సివిస్ట్ తదితర వైద్య నిపుణుల సాయంతో శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తి చేశాం. రెండు భుజాలూ ఇపుడు చక్కగా పని చేస్తున్నాయి. ఆ వ్యక్తి ఆరోగ్యకరంగా ఉన్నాడు' అని మోహన్ వివరించారు.

బెంగళూరు విపణిలో పండ్లు కూరగాయల ధరలు

(హాప్‌కామ్స్- కిలో..రూ.లలో)

● బీన్స్-	55
● క్యారెట్-	65
● బీరకాయలు-	40
● క్యాబేజి-	20
● కాలిఫ్లవర్ (ఒక్కోటి)-	25
● సొరకాయ-	40
● దొండకాయలు-	45
● పొట్లకాయ-	35
● టమాటా(నాటు)-	45
● టమాటా (సాధారణం)-	40
● గుమ్మడి-	40
● ఆలుగడ్డ-	40
● ఉల్లిగడ్డలు (మేలురకం)-	65
● ఉల్లిగడ్డలు (సాధారణ)-	50
● సాంబారు ఉల్లి-	95
● తెల్లగడ్డలు-	380
● బీట్‌రూట్-	25
● వంకాయలు-	45
● బెండకాయలు-	40
● ముల్లంగి-	35
● మునగకాయ(ఒక్కటి)-	10
● నిమ్మకాయలు	- 200
● వాషింగ్టన్ ఆపిల్	- 305
● సిమ్లా ఆపిల్	- 120
● గ్రీన్ ఆపిల్	- 320
● అరటి కాయలు	- 44
● సపోటా	- 55
● పైనాపిల్	- 38
● బొప్పాయి	- 44
● ఆరంజి	- 110
● బత్తాయి	- 55


చాముండి కొండపై నిషేధాజ్ఞలు జారీ

మైసూరు, న్యూస్‌టుడే : చారిత్రక చాముండి బెట్టపై మహిష దసరా, మండలోత్సవాలను ఆచరిస్తామని కొన్ని సంఘాలు పిలుపునిచ్చిన నేపథ్యంలో నగరం, బెట్టపై నిషేధాజ్ఞలను జారీ చేస్తూ కమిషనర్ సీమా లాట్కర్ ఆదేశాలు జారీ చేశారు. శనివారం అర్ధరాత్రి నుంచే నిషేధాజ్ఞలు అమలులోకి వచ్చాయి. సోమవారం ఉదయం ఆరు గంటల వరకు నిషేధాజ్ఞలు కొనసాగుతాయని ఆమె ప్రకటించారు. టౌన్‌హాల్ ఆవరణలో మాత్రమే మహిష మండలోత్సవాలను నిర్వహించుకునేందుకు అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు.

ఆకాశమే హద్దుగా పర్యాటకుల కోలాహలం

రామోజీ ఫిల్మ్‌సిటీలో సందడే సందడి

రామోజీ ఫిల్మ్‌సిటీ, న్యూస్‌టుడే: పండగల వేళ పర్యాటకుల రాకతో రామోజీ ఫిల్మ్‌సిటీ సందడిగా మారింది. దసరా, దీపావళి పండగలను పురస్కరించుకుని ఈ నెల 26న ప్రారంభమైన వేడుకల్లో నిత్యం ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఫిల్మ్‌సిటీ సందర్శనకు వచ్చి మ్యూజికల్ గ్లో గార్డెన్ అందాలను వీక్షిస్తూ ముగ్ధులవుతున్నారు. ఫిల్మీ స్ట్రీట్ విశేషాలు ఆబాలగోపాలాన్ని ఆకట్టుకుంటున్నాయి. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు వేడుకల్లో పాలుపంచుకుంటూ చిన్నా, పెద్ద ఉల్లాసంగా గడుపుతున్నారు.





RAMOJI FILM CITY

సరదాసరదా కార్యక్రమాలు, వినోదం పంచే ఏర్పాట్లు ప్రతి ఒక్కరినీ ఆనందతీరాలకు చేర్చుతున్నాయి. లైవ్ షోలు మధురానుభూతిని పంచుతున్నాయి. సాయంత్రం వేళల్లో సంతోషాలను ఆస్వాదించాలనుకునే పర్యాటకులు మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి వచ్చి ఆనందిస్తున్నారు. రామోజీ ఫిల్మ్‌సిటీని సరికొత్త విద్యుద్దీప కాంతుల్లో కళ్లారా వీక్షించి మధుర జ్ఞాపకాలను పదిలం చేసుకుంటున్నారు. స్టూడియో టూర్‌తో ఫిల్మ్‌సిటీని చుట్టేస్తూ సినీజగత్తులో విహారాన్ని ఆస్వాదిస్తున్నారు. రాజసం ఉట్టిపడేలా సాగే కార్నివాల్ పరేడ్, సంభ్రమాశ్చర్యాలను కళ్లముందుకు తెచ్చే మోషన్ క్యాప్చర్, వర్చువల్ షూట్ ఇలా.. అనుక్షణం ఆనంద వీక్షణాలతో పండగల వేళ చిన్నాపెద్దా ఆనందిస్తున్నారు. ఇంకెందుకు ఆలస్యం.. మీరూ రామోజీ ఫిల్మ్‌సిటీ సంబరాల్లో పాలుపంచుకోవచ్చు పదండి.



రవాణా సౌకర్యం.. రామోజీ ఫిల్మ్‌సిటీలో పండగ సంబరాలకు విచ్చేసే పర్యాటకులకు హైదరాబాద్ నగరంలోని వివిధ ఎంపిక చేసిన ప్రాంతాల నుంచి పికప్, డ్రాపింగ్ సౌకర్యం కల్పిస్తున్నారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా వేడుకలను ఆస్వాదించేందుకు వచ్చే వారికి ఇది ఎంతగానో దోహదపడుతుంది.

మరిన్ని వివరాలకు..

www.ramojifilmcity.com ఫోన్ నంబర్ 76598 76598ను సంప్రదించవచ్చు.

వికటించిన ఇంజక్షన్

చిక్కమగళూరు, న్యూస్‌టుడే : తీవ్ర జ్వరంతో బాధపడుతున్న సోనేశ్ (7) అనే బాలునికి ఇచ్చిన ఇంజక్షన్ వికటించి మరణించిన ఘటన కెంచాపుర గ్రామంలో చోటు చేసుకుంది. అజ్జంపురలోని ప్రైవేటు క్లినిక్‌లో వైద్యుడు వరుణ్ వద్ద గత మంగళవారం నుంచి చికిత్సకు తీసుకువెళ్లేవారు. క్లినిక్‌లో ఇచ్చిన ఇంజక్షన్ వికటించి, శుక్రవారం రాత్రి బాలుడు మరణించాడు. మృతుని తండ్రి అశోక్ ఫిర్యాదుతో అజ్జంపుర ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

బిహార్ కార్మికుడి మృతి

కోలారు, న్యూస్‌టుడే : మాలూరు తాలూకా మిటగానహళ్లి గ్రామంలోని కంకర క్వారీలో శనివారం సంభవించిన ప్రమాదంలో బిహార్‌కు చెందిన కార్మికుడు రూపేశ్ (30) మరణించాడు. లోడింగ్ సమయంలో కంకర మీద పడడం, లారీ చక్రం పైనుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మరణించాడు. మాస్తి ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

'సైడర్'కు బంగారు పతకాలు

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : లండన్‌లో నిర్వహించిన అంతర్జాతీయ సైడర్ ఛాలెంజ్ పోటీల్లో ఇండియన్ సైడర్ బ్రాండ్ 'ఎల్ 74' రెండు బంగారు, వెండి, కాంస్య పతకాన్ని దక్కించుకుంది. రుచిని, ఆరోగ్య ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని తయారు చేస్తున్న సైడర్‌కు పతకాలు రావడంతో తమ బాధ్యత మరింత పెరిగిందని వైల్డ్ హార్వెస్ట్ బ్రూయింగ్ సంస్థ డైరెక్టర్ కల్ప్ పటేల్ పేర్కొన్నారు. శనివారం ఇక్కడ నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో భారతీయ సైడర్‌కు బంగారు పతకం రావడం ఇదే మొదటిసారి అని తెలిపారు.

సీఐడీకి గాడిద పాల కేసు

హొసపేటె, : హొసపేటె పట్టణంలో జెన్నీ మిల్క్ పేరిట గాడిద పాల విక్రయ వంచన కేసును సీఐడీకి అప్పగించాలని ప్రభుత్వానికి ఉత్తరం రాసినట్లు విజయనగర ఎస్పీ శ్రీహరిబాబు తెలిపారు. శనివారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రూ.3 కోట్లకుపైగా మోసానికి పాల్పడినట్లు కేసు నమోదైతే, దాన్ని సీఐడీకి అప్పగించాల్సి ఉంటుందన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వానికి రెండు రోజుల క్రితం ఉత్తరం రాశామని తెలిపారు. గాడిద పాల అమ్మకం పేరిట తమను మోసం చేశారంటూ సుమారు 278 మంది బాధితులు ఫిర్యాదు ఇచ్చిన విషయం తెలిసిందేనన్నారు. సుమారు రూ.13.50 కోట్ల మేర మోసం జరిగినట్లు తెలిపారు.

బెంగళూరు

● బెంగళూరు ● హోసూరు



ఊర్వశి థియేటర్‌లో కటౌట్ వద్ద అభిమానులు

ఎన్టీఆర్ అభిమానుల సందడి

బెంగళూరు (శివాజీనగర) న్యూస్‌టుడే : ఆరేళ్ల తర్వాత జూనియర్ ఎన్టీఆర్ సోలో హీరోగా నటించిన దేవర సినిమా నగరంలోని పలు థియేటర్లలో శుక్రవారం విడుదలైంది. థియేటర్ల ఆవరణలో అభిమాన సంఘాలు భారీ కటౌట్లు ఏర్పాటు చేశాయి. వాటి ముందు అభిమానులు బాణసంచా కాల్చి నృత్యాలు చేశారు. సినిమా చూసి వచ్చిన ప్రేక్షకులకు కొన్నిచోట్ల అభిమాన సంఘాలు లడ్డూలు పంచి సంతోషాన్ని పంచుకున్నారు.



మంత్రి నారా లోకేశ్‌కు చెక్కు అందిస్తున్న బీటీఎఫ్ ప్రతినిధులు

చెక్కు అందించిన ఫోరం సభ్యులు

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే : బుడమేరు వాగు ఉద్ధృతికి ఉమ్మడి కృష్ణా జిల్లాలో దెబ్బతిన్న ప్రాంతాల్లో సహాయ కార్యక్రమాలు చేపట్టిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి బెంగళూరు తెలుగుదేశం ఫోరం చేయూత అందించింది. మంత్రి నారా లోకేశ్‌ను కలిసిన ఫోరం సభ్యులు ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.2,56,252 చెక్కును అందజేశారు. లోకేశ్‌ను కలిసిన వారిలో ప్రతినిధులు కోకా కేశవ్, యోగేశ్ గోపినేని, వంశీ మన్యం, సతీశ్ ఆవల, రామాంజనేయులు ఉన్నారు.

హోసూరు ఖబుర్లు

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



చికిత్స చేస్తున్న వైద్యులు, సిబ్బంది

హోసూరు, న్యూస్‌టుడే : హోసూరు తాలూకా బుక్కసాగరం గ్రామంలో విశ్రాంత కలెక్టర్ కృష్ణ స్థాపించిన ఎన్టీఆర్ పాఠశాలలో శనివారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఎడవనపల్లిలోని ఆక్స్‌ఫర్డ్ వైద్య కళాశాల, ఆసుపత్రి డైరెక్టర్ ఎస్.రమేష్‌రాజు డాక్టర్ల బృందాన్ని పంపించారు. విశ్రాంత కలెక్టర్ కృష్ణ భార్య పద్మావతి హాజరై శిబిరంలో ఏర్పాట్లు పర్యవేక్షించారు. శిబిరంలో వెయ్యి మంది ఆరోగ్య పరీక్షలు చేయించుకొన్నట్లు వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ విజయలక్ష్మి, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

తళి రోడ్డులో వార్డుల పరిశీలన



వార్డులో పర్యటిస్తున్న కమిషనర్ శ్రీకాంత్, కార్పొరేటర్ చెన్నీరప్ప

హోసూరు, న్యూస్‌టుడే : హృతిక్ రోడ్డులోని ఎస్‌బీఎం కాలనీ ప్రాంతాన్ని కార్పొరేషన్ కమిషనర్ శ్రీకాంత్ సందర్శించి అక్కడి నివాసులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిశీలించారు. పార్కులో ఉపకరణాల స్థితిగతులను చూశారు. కార్పొరేటర్ చెన్నీరప్ప తన వార్డులోని సమస్యలను కమిషనర్‌కు వివరించారు. అంగన్‌వాడీ భవన నిర్మాణం, ఆసుపత్రి భవన నిర్మాణం నాణ్యతను పరిశీలించారు. నివాసుల సంక్షేమ సంఘం నిర్వాహకులు కమిషనర్‌కు సమస్యలను వివరించారు. కార్యక్రమంలో కార్పొరేషన్ ఇంజినీర్, అధికారులు పాల్గొన్నారు.

వైష్ణవాలయాల్లో ప్రత్యేక పూజలు



గోపసంద్రం ఆలయంలో శ్రీనివాసుడు

హోసూరు, న్యూస్‌టుడే : పురటాశి మాసం రెండో శనివారం సందర్భంగా హోసూరులోని వైష్ణవ ఆలయాల్లో భక్తులు పూజలు చేశారు. హోసూరు-కృష్ణగిరి జాతీయ రహదారిలో కామన దొడ్డి శివారు దక్షిణ పినాకిని నదీతీరంలో గుట్ట మీద వెలసిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామిని పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి, ఆంజనేయస్వామికి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

సమస్యలు పరిష్కరిస్తాం



ఎమ్మెల్యేను సత్కరిస్తున్న పదాధికారులు

బెంగళూరు (యలహంక), న్యూస్‌టుడే : యలహంక ప్రాంతంలో నిత్యం దినపత్రికలను పంపిణీ చేసే వ్యక్తులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే ఎస్.ఆర్.విశ్వనాథ్ హామీ ఇచ్చారు. యలహంకలో దినపత్రికల పంపిణీదారుల సంఘం ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. సంఘానికి అవసరమైన భూమి కేటాయించేందుకు ప్రయత్నిస్తానని తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను సత్కరించారు. కార్యక్రమంలో సంఘం పదాధికారులు హాజరయ్యారు.

హృదయ రక్తనాళాల సదస్సు



కార్యక్రమంలో అనింధ్యా, వైద్య నిపుణులు

బెంగళూరు (కెంగేరి), న్యూస్‌టుడే : ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా శనివారం నిమ్హాన్స్ కన్వెన్షన్ సెంటర్‌లో హృదయ రక్త నాళాల సమస్యలపై సదస్సు జరిగింది. ఆరోగ్యశాఖ మంత్రి దినేష్‌గుండూరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. హ్యాపీ యెస్ట్ సీఇఓ అనింధ్యాచౌదరి, వైద్యులు వివేక్‌జవళి, రంజన్‌శెట్టి, దీపక్‌కృష్ణమూర్తి, అల్బెన్‌సిగమణి, కె.ఎస్.రవీంద్రనాథ్, అనుపమా తదితరులు చర్చించారు. స్థూలకాయంతో గుండెపై కలిగే పరిణామాలు, ధూమపానం, రక్తపోటు, ఒత్తిడితో గుండె సంరక్షణ, ఆరోగ్యదృష్టిలో చేపట్టాల్సిన ముందు జాగ్రత్తలు తదితర అంశాలపై నిపుణులు వివరించారు.


మాదప్ప హుండీల్లో రూ.1.64 కోట్ల కానుకలు

చామరాజనగర : ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మలె మహదేశ్వర బెట్టపై గత 28 రోజులుగా హుండీలకు వచ్చిన కానుకలను శుక్రవారం లెక్కపెట్టారు. హుండీ ఆదాయం రూ.1.64 కోట్లని అధికారుల ప్రకటించారు. బస్టాండ్ ఆవరణలోని సాలూరు బృహన్మఠం ఆవరణలో శాంతమల్లికార్జున స్వామి ఆవరణలో కానుకలను లెక్కపెట్టారు. నగదుతో పాటు 21 గ్రాముల బంగారు ఆభరణాలు, 2.1 కిలోల వెండి వస్తువులు హుండీల్లో ఉన్నట్లు అధికారులు తెలిపారు.

కూలిన మళఖేడ కోటగోడ

కలబురగి, న్యూస్‌టుడే : భారీ వర్షాలకు సేడం తాలూకా మళఖేడ కోట గోడ విరిగి పడింది. ఉన్నట్లుండి గోడలో కొంత భాగం విరిగిపోయింది. గత ఆగస్టు 31న కోటగోడ కొంత భాగం కూలిపోయింది. పురావస్తు శాఖ అధికారులు సకాలంలో మరమ్మతులు చేయకపోవడంతోనే గోడ మొత్తం కూలిపోయే స్థితికి చేరుకుందని స్థానికులు ఆక్రోశించారు.

2న మెగా ఉచిత వైద్య శిబిరం



సమావేశంలో మాట్లాడుతున్న అశోక్, తదితరులు

బెంగళూరు (జాలహళ్లి) : ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లలేని పేదలకు ఉచితంగా వైద్యం అందాలనే ఉద్దేశంతో అక్టోబరు 2న మెగా ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు కేబీసీ ట్రస్టు ఛైర్మన్ కె.సి.అశోక్ తెలిపారు. ఆయన శనివారం ఇక్కడ విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. కమ్మగుండనహళ్లి చిక్కమునియప్ప రోడ్డు, అశోక్ పాలిటెక్నికల్ కళాశాల ఆవరణంలో ఉదయం 9 గంటలకు శిబిరాన్ని ప్రారంభిస్తామన్నారు. 28 ఏళ్ల నుంచి ఏటా వైద్యశిబిరం నిర్వహిస్తున్నామన్నారు. పేద ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ప్రతినిధులు సురేష్, లిగరాజు, రోషన్ అశోక్, డి.ఆర్ సుబ్బారెడ్డి, చంద్రిక, శ్యామ్‌సుందర్ పాల్గొన్నారు.

కర్ణాటక పోలీసుల కారు బోల్తా

ధర్మవరం, న్యూస్‌టుడే : కర్ణాటకలో చోరీలకు పాల్పడి పరారీలో ఉన్న ఇరానీ ముఠా సభ్యులు ద్విచక్ర వాహనంలో వెళుతుండగా పట్టుకునేందుకు కారులో వెంటపడుతున్న కర్ణాటక పోలీసుల వాహనం శ్రీసత్యసాయి జిల్లా, ధర్మవరం మండలం రాంపురం క్రాస్ వద్ద శనివారం అదుపు తప్పి బోల్తా పడింది. పోలీసులు ప్రమాదానికి గురికావడంతో ఇరానీ గ్యాంగ్ సభ్యులు తప్పించుకున్నారు. ప్రమాదంలో తుముకూరు జిల్లా మెడిగేశి ఎస్ఐ అమ్మనగి కానిస్టేబుళ్లు రమేష్, ప్రకాష్, ముద్దురాజు గాయపడ్డారు. వారిని స్థానికులు ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందడంతో ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించారు. చోరులను పట్టుకునే యత్నంలో వాహనం అదుపు తప్పి ప్రమాదానికి గురయ్యామని కర్ణాటక పోలీసులు తెలిపారు.



పాడైన రహదారి



గుంతల్లో వాహనదారుల సంచారం



పెద్దగుంతల వద్ద బ్యానర్లతో పౌర సంస్థల ప్రతినిధుల నిరసన

ఇంకా.. తీరని గుంతల సమస్య

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : బెంగళూరు నగర రహదారుల్లో పడిన గుంతలు తీరని సమస్యగా మారాయి. వీటిని పూడ్చుతున్నట్లు చీఫ్ కమిషనర్ నుంచి కింద స్థాయి ఇంజనీర్ల వరకు నిత్యం ప్రకటిస్తున్నారు. మరో వైపు రహదారుల్లో ఏర్పడిన గుంతల వల్ల నెలకొంటున్న సమస్యలపై ప్రజలు తీవ్ర నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. హెబ్బగూడి, చంబేనహళ్లి చుట్టుపక్కల రహదారుల దుస్థితిపై స్థానికులు నిరసన ప్రదర్శనలు చేపట్టారు. శనివారం సెలవు కావడంతో ప్రజలు రహదారుల్లోకి వచ్చి నిరసనలు వ్యక్తం చేశారు. అధికారులు, సిబ్బంది రాత్రింబవళ్లు కష్టపడి 14 వేల గుంతలు పూడ్చారని ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తెలిపారు. ఇంకా గుంతలు ఉన్నాయని వాటిని ఎప్పుడు పూడ్చుతారని నిలదీశారు. మరో వైపు సివిక్ సంస్థల సభ్యులు గుంతల పూడ్చడటంతో అవినీతి, అక్రమాలు జరిగినట్లు ఆరోపిస్తూ రహదారుల్లో బ్యానర్లు ప్రదర్శించారు. ప్రధాన రహదారులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, మంత్రులు సంచరించే రహదారుల్లో పడిన గుంతలను మాత్రమే పూడ్చినట్లు ఆరోపిస్తున్నారు. మిగతా ప్రాంతాల్లోని రహదారులు వాహనాలు సంచరించలేని పరిస్థితులు నెలకొన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రహదారులు బాగలేకపోవడంతో గంటల తరబడి రహదారిపై ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఆక్రోశం వ్యక్తం చేశారు. రహదారుల మరమ్మతుల కోసం రూ.660 కోట్లు కేటాయించినట్లు ప్రభుత్వం ప్రకటించింది. కానీ అందులో గుంతల పూడ్చివేతకు ఎంత ఖర్చు చేశారో తెలియని పరిస్థితి నెలకొంది. రహదారులు బాగు కోసం ఆయా ప్రాంతాల ప్రజలు వీధుల్లోకి వచ్చి నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. మరో వైపు గుంతల పూడ్చివేత పనులు కొనసాగిస్తున్నట్లు పాలికె అధికారులు తెలిపారు.



హెబ్బగూడి, చంబేనహళ్లి నివాసుల నిరసన ప్రదర్శన

సమస్యల పరిష్కారానికే జనస్పందన

బెంగళూరు (మత్తికెరె), న్యూస్‌టుడే : ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కారించడానికే జనస్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నామని యశ్వంతపుర ఏసీపీ మేరిశైలజా తెలిపారు. ఇక్కడ గంగమ్మగుడి పోలీస్ స్టేషన్‌లో శనివారం నిర్వహించిన జనస్పందనలో ఆమె మాట్లాడారు. కాలనీల్లో అనుమానాస్పదంగా ఎవరైనా సంచరిస్తున్నట్లు తెలిస్తే వస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ప్రతి ఒక్కరూ పోలీసులతో స్నేహంగా ఉండాలన్నారు. నిత్యం మీకు పోలీసులు అండాగా ఉంటారన్నారు ఈకార్యక్రమంలో సీఐ సిద్దేగౌడ, ఎస్సైలు గోవిందరాజు, శివనంద్, కన్నడ సేన అబ్బిగిరి అధ్యక్షుడు జేమ్స్, స్థానికులు పాల్గొన్నారు.



జనస్పందనలో మాట్లాడుతున్న ఏసీపీ మేరి శైలజా

నగరంలో ఈనాడు

- ఉదయం 10 గంటలకు కర్ణాటక చిత్రకళా పరిషత్తులో హస్తకళా ఉత్పత్తుల ప్రదర్శనతో పాటు వస్త్రాభరణ-2024 ప్రదర్శన కొనసాగుతుంది.
- ఉదయం 10.30 గంటలకు రాజప్రాసాద మైదానం కింగ్ కోర్టులో భారతీయ ఆభరణాలు, లైఫ్‌స్టైల్ నగల ప్రదర్శన సాగుతుంది.
- ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సెయింట్ జోసెఫ్ కళాశాల మైదానంలో విజ్ఞాన లోకం సన్‌ఫ్లవర్ డార్క్ ఫ్యాంటసీ విన్యాస్ సైన్స్ బస్సులో సందర్శించేందుకు విద్యార్థులకు అవకాశం కల్పిస్తారు.
- సాయంత్రం 5 గంటలకు విధానసౌధ బ్యాంక్వెట్ హాల్లో అఖిల భారత మహిళా న్యాయవాదుల సమాఖ్య, కర్ణాటక మహిళా న్యాయవాదుల సమాఖ్య ముగింపు సమావేశంలో ఉన్నత న్యాయస్థానం న్యాయమూర్తి అను శివరామన్, జస్టిస్ కె.ఎస్. ముడగల్, స్త్రీశిశు సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్, ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాలిని రజనీష్ పాల్గొంటారు.

- న్యూస్‌టుడే, బెంగళూరు (యశ్వంతపుర)

నిధులు విడుదల చేయాలని వినతి

బెంగళూరు (యశ్వంతపుర) : బుద్ధిమాంద్యం, దివ్యాంగులకోసం 25 ఏళ్ల నుంచి నిర్వహిస్తున్న వసతి పాఠశాలలకు ప్రభుత్వం ఏటా అందిస్తున్న ఆర్థిక సాయాన్ని ఈఏడాది కూడా విడుదల చేయాలని శారదామాత విద్యా సాంస్కృతిక సంస్థ సంచాలకుడు పుట్టిరామారాధ్య విజ్ఞప్తి చేశారు. అనాథలైన దివ్యాంగులు పస్తులు ఉండే విధంగా చేయవద్దని విన్నవించారు. కొందరు ప్రభుత్వ ఆర్థిక సాయాన్ని అక్రమంగా పొందుతూ తప్పుడు ప్రచారం చేస్తున్నారు. అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలి. ఆర్థిక సాయం విడుదల కాకపోవడంతో బాలలు మరింత ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితులు వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి ఆర్థిక సాయం సాయం విడుదల చేయాలని కోరారు.

మురుగునీటి బాధ తప్పించండి



మురుగునీటితో నిండిన గుంతలు

పావగడ, న్యూస్‌టుడే : పట్టణంలోని ఉగ్రనరసింహప్ప కాలనీలో మురుగు నీరు కాలువ వ్యవస్థ లేక పోవడంతో అక్కడి నుంచి వచ్చే మురుగు నీరు దేవ రాజు అరసు ప్రభుత్వ బాలికల వసతి నిలయం, సత్యసాయి లేఅవుట్‌లోకి ప్రవేశించి దుర్వాసన వెదజల్లుతోంది. దోమలు, పందుల బెడద ఎక్కువవుతోందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఉగ్రనరసింహప్ప కాలనీలోని నివాసులు ఇళ్లల్లో వాడి వదిలేసిన వృధానీరు మురుగుగా మారి రహదారి వెంబడి ప్రవహిస్తోందని పురసభ ముఖ్యాధికారి జాఫర్ షరీఫ్, ఆరోగ్య అధికారి షంషుద్దీన్‌కు వినతి పత్రం అందచేసినా పట్టించుకోలేదని ఆడిటర్ శ్రీనాథ్, శ్రీనివాసమూర్తి, సాగర్, అరవింద్, శ్రీనివాసులు, నాగరాజప్ప ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు ఇప్పటికైనా కలుగజేసుకొని మురుగునీటి సమస్యను పరిష్కరించాలని పురసభ అధికారులకు విజ్ఞప్తి చేశారు.



ఊరేగింపులో అశేషభక్త సమూహం



నిమజ్జనానికి బయలుదేరిన హిందూ మహాగణపతి

వైభవోపేతంగా మహాగణపతి నిమజ్జనం

చిత్రదుర్గం, న్యూస్‌టుడే : విశ్వహిందూ పరిషత్, భజరంగదళ్ ఏర్పాటు చేసిన హిందూ మహాగణపతి శోభాయాత్ర వైభవంగా జరిగింది. శనివారం ఇక్కడ వినాయక నిమజ్జనం ఊరేగింపులో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. పట్టణంలోని కూడళ్లు, రహదారులను కాషాయ పతాకాలు, రంగురంగుల విద్యుత్తు దీపాలతో అలంకరించారు. శోభాయాత్రలో యువతీయువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. డీజేల సంగీత ధ్వనులకు యువకులు నృత్యాలు చేశారు. భజరంగదళ్ జాతీయ సంచాలకుడు నీరజ్ దోనేరియా వినాయకునికి పూజలు చేసి శోభాయాత్ర ప్రారంభించారు. కార్యక్రమంలో చిత్రదుర్గం ఎంపీ గోవిందకారజోళ, ఎమ్మెల్యే వీరేంద్ర, ఎమ్మెల్సీ నవీన్, మాజీ ఎమ్మెల్యే తిప్పారెడ్డి, నగరసభ సమితా రఘు, విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు షడాక్షరప్ప, నేతలు బదరీనాథ్, కేశవ్, ప్రభంజన్ తదితరులు హాజరయ్యారు. శోభాయాత్ర ప్రారంభోత్సవ వేడుకల్లో అధ్యాత్మిక గురువులు, వివిధ ధార్మిక మఠాల పీఠాధిపతులు శివలింగానందస్వామి, బసవమూర్తి మాదార చెన్నయ్యస్వామి, పురుషోత్తమానందపురి స్వామి, సర్దార్ సేవాలాల్ స్వామి పాల్గొన్నారు. ముక్తి పతాకాన్ని రూ.2.05 లక్షలకు మంజునాథ్, పూల హారాన్ని రూ.1.60 లక్షలకు తిప్పేస్వామి, నోట్ల హారాన్ని రూ.2.50 లక్షలకు తిప్పేస్వామి, పూరీ జగన్నాథ్ దేవాలయం చెక్క నమూనాను రూ.2.25 లక్షలకు ఎమ్మెల్యే వీరేంద్ర సహోదరుడు నాగరాజ్, పండ్ల బుట్టను రూ.60 వేలకు ఉమేశ్ కారజోళ, పెద్ద లడ్డు రూ.70 వేలకు మోహన్, హిందూ మహాగణపతి చిత్రపటాన్ని రూ.60 వేలకు మంజణ్ణ, మొక్కజొన్న గింజల హారాన్ని రూ.40 వేలకు కొట్రేశ్‌లు వేలం పాటలో కొనుగోలు చేశారు. శోభాయాత్రలో భక్తులు, కార్యకర్తలకు పట్టణంలోని సంఘ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు పులిహోరా, చిత్రాన్నం, పెరుగన్నం, తాగునీరు, మజ్జిగ, పానకం, పెసరబేడలు ఉచితంగా అందించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా మూడున్నర వేల మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు.

హరిదాస సాహిత్య సమ్మేళన అధ్యక్షుడిగా శ్యామాచార్



సమావేశంలో గోపాల్‌ఆచార్, గురురాజరావు, శ్యామాచార్ తదితరులు

బెంగళూరు (కెంగేరి), న్యూస్‌టుడే : హరిదాస సాహిత్య సమ్మేళన అధ్యక్షుడిగా పేరొందిన హరిదాస పరిశోధకుడు డాక్టర్ ఏబీ శ్యామాచార్ ఎన్నికయ్యారు. బెంగళూరులోని బసవనగుడి పుత్తిగె మఠం గోవర్ధన క్షేత్రంలో జరిగిన సమావేశంలో ఆయనను ఎన్నుకున్నారు. నవంబరు 9 నుంచి 11 వరకు విజయదాసర ఆరాధన సందర్భంగా నిర్వహించనున్న దాస సాహిత్య సమ్మేళన పూర్వ సిద్ధతపై ఏర్పాటు చేసిన సభలో వాదిరాజ పరిశోధన ప్రతిష్ఠాన డైరెక్టర్ గోపాల్‌ఆచార్ వివరాలు తెలిపారు. సమావేశంలో శ్రీనివాస ఉత్సవ బళగ అంతర్జాతీయ హరిదాస సాహిత్య సమ్మేళన కార్యకారి సమితికి చెందిన కె.ఆర్.గురురాజరావ్, భారతీయ హరిదాసు సాహిత్య విద్యాలయం డైరెక్టర్ పరశురామ బెటగిరి, గురురాజ పోశెట్టిహళ్లి, విదూషి డా.వారుణి జయతీర్థ తదితరులు పాల్గొన్నారు.

పునీత్ అభిమాని సైకిల్ యాత్ర



ముత్తుసెల్వన్

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే : దివంగత పునీత్ రాజ్‌కుమార్ అభిమాని ముత్తుసెల్వన్ సైకిల్ యాత్రలో భాగంగా కర్ణాటక కారావారకు చేరుకొన్నారు. తమిళనాడు కొయంబత్తూరుకు చెందిన ఇతడు సైకిల్ ప్రయాణంలో అప్పు పేరిట నాలుగు లక్షలకు పైగా మొక్కలు నాటి తన అభిమానాన్ని చాటుకుంటున్నారు. ఐదు లక్షల మొక్కల నాటడమే లక్ష్యంగా పెట్టుకొన్నట్లు వెల్లడించాడు. 2021 డిసెంబరులో పర్యటన ప్రారంభించిన సెల్వన్ 23,650 కిలో మీటర్లు పూర్తిచేశారు. పునీత్‌రాజ్‌కుమార్ సతీమణి అశ్వినీ రాజ్‌కుమార్ ఈ సైకిల్ తనకు ఇచ్చారని తెలిపాడు. వచ్చే జనవరిలో పునీత్‌రాజ్‌కుమార్ సమాధి ముందు తన పర్యటన పూర్తి అవుతుందన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువతి మృతి

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : అతివేగంగా సంచరిస్తున్న లారీ, ముందు వెళుతున్న ఆటోను ఢీకొనడంతో అందులో ప్రయాణిస్తున్న యువతి శాలిని (26) అక్కడిక్కడే మృతి చెందగా, డ్రైవర్ గాయపడిన సంఘటన శనివారం ఇక్కడ కబ్బన్‌పార్కు సంచార పోలీసుఠాణా పరిధిలో జరిగింది. తెల్లవారుజామున 4 గంటలకు కాఫీబోర్డు సిగ్నల్ వద్ద ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు. గాయపడిన డ్రైవర్ ఇమ్రాన్ బౌరింగ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. బెన్సన్ టౌన్ చిన్నప్ప గార్డన్ నుంచి మెజిస్టిక్ వైపు వెళుతున్న ఆటోను వేగంగా వచ్చిన లారీ ఢీకొన్నట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు లారీ డ్రైవర్ కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

73 వాహనాలపై కేసులు

బెంగళూరు (యలహంక), న్యూస్‌టుడే : నగర సంచార పోలీసులు, ఆర్టీఓ అధికారులు సంయుక్తంగా శుక్రవారం రాత్రి వివిధ ప్రాంతాల్లో వాహనాల తనిఖీలు నిర్వహించారు. 73 వాహనాలపై కేసులు నమోదు చేసి, పన్ను చెల్లించని 31 వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు రవాణాశాఖ కమిషనర్ ఎ.ఎం.యోగేశ్ తెలిపారు. నీరు సరఫరా చేస్తున్న ట్యాంకర్ల యజమానులు ప్రభుత్వానికి పన్నులు చెల్లించడం లేదని, రహదారి అర్హత పత్రం, డీఎల్ లేకుండా నడుపుతున్నారనే సమాచారం ఆధారంగా కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. 300 వాహనాలను తనిఖీ చేసినట్లు ఆయన వెల్లడించారు.

విచారణకు స్నేహమయి కృష్ణ

చామరాజనగర, న్యూస్‌టుడే : ముడా కేసులో ముఖ్యమంత్రి సిద్ధరామయ్యపై ఫిర్యాదు చేసిన సామాజిక కార్యకర్త స్నేహమయి కృష్ణ తనపై నమోదైన వంచన కేసు విచారణకు న్యాయస్థానంలో హాజరయ్యారు. కరుణాకర అనే వ్యక్తి నుంచి 2018, 2019, 2020లో వరుసగా రూ.లక్ష చొప్పున రూ.3 లక్షలు తీసుకుని తిరిగి చెల్లించలేదన్న ఆరోపణలు ఉన్నాయి. తాను రూ.50 వేలు తీసుకున్నానని, ప్రామిసరీ నోటుపై సంతకం చేయించుకుని, రూ.3 లక్షలని కరుణాకర రాసుకున్నాడని కృష్ణ ఆరోపించారు. న్యాయస్థానంలో ఇరు పక్షాల వాదనలను ఆలకించిన అనంతరం న్యాయమూర్తి విచారణను వాయిదా వేశారు. సాధారణ పౌరుడు కూడా అక్రమాలకు పాల్పడిన ముఖ్యమంత్రిపై కేసు వేయవచ్చునేందుకు తానే ఉదాహరణ అని ఆయన పేర్కొన్నారు.

క్రైం కార్నర్

సార్..నన్ను అత్తారింటికి పంపండి

చిక్కమగళూరు, న్యూస్‌టుడే : మూడిగెరె తాలూకా తరువె గ్రామానికి చెందిన కృష్ణ అనే వ్యక్తి కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేశాడు. 'సార్ ఊళ్లో గొడవ జరుగుతోంది..నాపై దాడి చేసేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారు' అంటూ ఏడుస్తూ పోలీసులకు గురువారం రాత్రి సమాచారం అందించాడు. కాల్‌ను నమ్మి జీపులో పోలీసులు ఆ గ్రామానికి చేరుకుని, అతని వద్దకు వెళ్లారు. 'మా అత్త మామలు ఫల్గుణి గ్రామంలో ఉంటారు. వారి వద్దకు వెళ్లేందుకు ఏ వాహనమూ దొరకలేదు. మీరు డ్రాప్ ఇస్తారని ఫోన్ చేశాను. నన్ను కాస్త ఫల్గుణి గ్రామంలో విడిచి పెట్టండి' అని కోరడంతో పోలీసులు కంగు తిన్నారు. అతన్ని మందలించినా, మాట వినకపోవడంతో ఆ మార్గంలో వస్తున్న లారీని నిలిపి అందులోకి ఎక్కించి పంపించారు.

బెయిలు అర్జీలు వాయిదా

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే : చిత్రదుర్గకు చెందిన రేణుకాస్వామి హత్య కేసులో ఏ1, ఏ2గా ఉన్న నటి పవిత్రా గౌడ, నటుడు దర్శన్ బెయిలు అర్జీలు సోమవారానికి వాయిదా పడ్డాయి. ఇదే కేసులో ఏ10 వినయ్ వేసుకున్న అర్జీ విచారణ అక్టోబరు 5కు వాయిదా పడింది. హత్య కేసులో పవిత్రా పాత్ర ఏమీ లేదని, రేణుకాస్వామిని అంతమొందించాలని ఎవరినీ ప్రేరేపించలేదని ఆమె తరపు న్యాయవాది టామి సెబాస్టియన్ 57వ సిటీ సివిల్ న్యాయస్థానంలో వాదనలు వినిపించారు.

తెలుగు ప్రముఖుడికి సత్కారం



ప్రసాద్‌ను సత్కరిస్తున్న పదాధికారులు

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : ధార్వాడ్ కర్ణాటక విశ్వవిద్యాలయం నుంచి గౌరవ డాక్టరేట్ పొందిన హుబ్బళ్లి తెలుగు ప్రముఖుడు డాక్టర్ సీహెచ్.వి.ఎస్.వి.ప్రసాద్‌ను హుబ్బళ్లిలో విశ్వ హిందూ పరిషత్తు, రాణి చెన్నమ్మ గజణన మండలి పదాధికారులు సత్కరించారు. ఆంధ్రప్రదేశ్ నుంచి కర్ణాటకకు వచ్చి హుబ్బళ్లిలో వివిధ సామాజిక సేవ కార్యక్రమాలను డాక్టర్ ప్రసాద్ చేపడుతున్నారని, అందుకు తాము రుణపడి ఉన్నట్లు ఆయా సంఘాల నేతలు కొనియాడారు. కార్యక్రమంలో సంఘాల పదాధికారులు గోవిందరావు, ఎం.వి.కణ్ణమరి, సంజయ్ భడ్కార్, సుభాష్ సింగ్ జమేదార్, జయంతీకట్టి, బసవరాజు, రఘు, ఉమేశ్‌దూసీ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి జాతీయ పురస్కారం



రవీంద్రారెడ్డికి పురస్కారం అందిస్తున్న సుబ్రమణ్య శర్మ తదితరులు

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : బెంగళూరు నగరంలోని ఓపీహెచ్ రోడ్డు ప్రభుత్వ తెలుగు ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు రవీంద్రారెడ్డి మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణ జాతీయ పురస్కారాన్ని స్వీకరించారు. ఇటీవల తిరుపతిలోని విశ్వం విద్యాసంస్థల ఆడిటోరియంలో యువతేజం, కళావిజన్ సంస్థలు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆ పురస్కారాన్ని రాధాకృష్ణ మనవడు డాక్టర్ సుబ్రమణ్యశర్మ ప్రదానం చేశారు. బెంగళూరు నగరంలో తెలుగు మాధ్యమం కోసం శ్రమిస్తున్నందుకు రవీంద్రారెడ్డిని పురస్కారానికి ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ నారాయణస్వామి, డాక్టర్ కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.


బస్సు ఢీకొని వృద్ధురాలికి గాయాలు

పావగడ : పట్టణంలోని బస్టాండ్ వద్ద రాజనందన హోటల్ ముందు శనివారం సాయంత్రం రహదారి దాటుతున్న వృద్ధురానికి కేఎస్ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఆమె తల, చేతులు, కాళ్ళకు గాయాలయ్యాయి. అనంతపురం జిల్లా కంబదూరు మండలం రాళ్ళపల్లి గ్రామానికి చెందిన సాకమ్మ (66) పనిమీద పావగడకు వచ్చి రహదారి దాటుతుండగా తుమకూరు డిపోకు చెందిన బస్సు ఆమెను ఢీకొంది. స్థానికులు బస్సు చోదకుడిపై గొడవకు దిగారు. చోదకుడు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. గాయపడిన మహిళను పట్టణ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

బళ్ళారి

• బళ్ళారి • రాయచూరు

ఎఫ్‌కేసీసీఐ అధ్యక్షుడిగా బాలకృష్ణ



బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే : కన్నడనాట 115 సంవత్సరాల ఘన చరిత్ర సొంతం చేసుకున్న కర్ణాటక వాణిజ్య, పరిశ్రమల సమాఖ్యకు 2024-25 ఏడాదికి అధ్యక్షుడిగా ఎంజీ బాలకృష్ణ ఎన్నికయ్యారు. సీనియరు ఉపాధ్యక్షురాలిగా ఉమా రెడ్డి, ఉపాధ్యక్షుడిగా టి. సాయిరాం వ్యవహరిస్తారు. సమాఖ్య కార్యాలయంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో వీరు బాధ్యతలను చేపట్టారు. ఎంజీ బాలకృష్ణ 1989 నుంచి సొంత పరిశ్రమను నెలకొల్పి విజయాన్ని సాధించారు. 13 ఏళ్ల నుంచి సమాఖ్య ఉపాధ్యక్షుడిగా, సీనియరు ఉపాధ్యక్షుడిగా, వివిధ సమితుల్లో క్రియాశీలకంగా సేవలందించారు. సేవలు, వ్యాపారం, ఎగుమతులకు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలను అందుకున్నారు.

కాంగ్రెస్ కార్యకర్తల నిరసన



నిర్మలా సీతారామన్, కుమారస్వామి ముఖకవచాలతో ఆందోళన

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఎన్నికల వేళ బాండ్ల సేకరణ చర్యలతో అక్రమాలకు తెరలేపారని, ఆమె తక్షణమే పదవికి రాజీనామా చేయాలని బెంగళూరు రేస్‌కోర్సు రోడ్డులో కాంగ్రెస్ కార్యకర్తలు ధర్నాకు దిగారు. ఎన్నికల బాండ్లపై న్యాయస్థానం స్పందించి ఆమెకు వ్యతిరేకంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేయాలని ఆదేశించినట్లు కేపీసీసీ ప్రధాన కార్యదర్శి మనోహర్ తెలిపారు. భూ డీనోటిఫికేషన్ అక్రమాలకు సంబంధించి లోకాయుక్త విచారణ ఎదుర్కొంటున్న కేంద్ర మంత్రి కుమారస్వామి తక్షణమే పదవి నుంచి తప్పుకోవాలని పట్టుబట్టారు. ముఖ్యమంత్రి సిద్ధ రామయ్యపై తప్పుడు కేసులు సరికాదని ఖండించారు.


ముఖ్యమంత్రి ఆదేశాలు బుట్టదాఖలు



రాయచూరు తాలూకా కస్బే క్యాంపులోని కాలువ

రాయచూరు, న్యూస్‌టుడే : తుంగభద్ర ఎడమకాలువ రైతుల ఆశలు నీరుగారి పోయాయి. చివరి ఆయకట్టు పొలాలకు నీరు అందించాలని సాక్షాత్తు ముఖ్యమంత్రి సిద్దరామయ్య మాటకు విలువ లేకుండా పోయింది. ఆయన ఆదేశాలు, సూచనలు బుట్టదాఖలయ్యాయి. ఈ నెల 22న హోస్పేటకు విచ్చేసిన సీఎంను రైతు సంఘం నాయకులు భేటీ అయి మాన్వి, సిరివార, రాయచూరు తాలూకా ఆయకట్టు ప్రాంతం అన్నదాతల సాగునీటి ఇబ్బందులను ఏకరవు పెట్టారు. కాలువలకు నీరు విడిచి రెండు నెలలు దాటినా సాగునీరు అందనందున వరి, పత్తి, మిరప సాగు ఎండిపోయేదశకు చేరుకుందని వివరించారు. ఎగువ భాగంలో నీటి చౌర్యం వల్లే దిగువ రైతుల పొలాలకు చేరడం లేదని ఫిర్యాదు చేశారు. ముఖ్యమంత్రి స్పందించి శివారు భూములకు సరఫరా చేయించాలని కొప్పళ జిల్లా బాధ్యమంత్రి శివరాజ్ తంగడికి స్పష్టం చేశారు. టేలెండ్ ప్రాంతానికి న్యాయం చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. భరోసా ఇచ్చి వారం రోజులు దాటినా ఇప్పటికీ ఎలాంటి మార్పు లేదు. 104వ మైలు వద్ద ఆరు అడుగుల గేజ్ ఉంటే దిగువ భూములకు చేరుతాయి. శనివారం సాయంత్రం వరకు మూడు అడుగులు ఉన్నాయి. 69వ మైలు వద్ద ఎనిమిది అడుగుల గేజ్ ఉంది. ఈ మైలు వద్ద కేవలం ఒక అడుగు తక్కువగా ఉంది. 104వ మైలు వద్ద కచ్చితమైన గేజ్ నిర్వహించనందున చివరి పొలాలకు అందడం లేదు. సిబ్బంది కొరత వలన చౌర్యం ఇలా అవుతోందని ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారని రైతు నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పైభాగంలోని లేని కొరత దిగువ ప్రాంతంలో ఎలా ఉంటుందని ప్రశ్నిస్తున్నారు.

నాలుగు రోజులే నీరిచ్చారు



జులై మూడో వారంలో కాల్వలకు నీరు వదిలారు. సెప్టెంబరు 28 వరకు కేవలం నాలుగు రోజులు సరఫరా చేశారు. మాన్వి తాలూకాలోని 82, 84, 85 ఉపకాలువల నీటిని 104వ మైలుకు మళ్లించనందునే గేజ్ మూడు అడుగులు చూపిస్తోంది. రాస్తారోకోలు చేసినా ప్రయోజనం లేదు. సాగునీటి కోసం ఏటా ఆందోళనలు చేయడం బాధాకరం. దీనికి శాశ్వత పరిష్కారం కనుగొనాలి. **- చామరస్ మాలిపాటిల్ (రైతు సంఘం)**

లక్ష ఎకరాల సాగు ప్రశ్నార్థకం

ఎగువ ప్రాంతంలో రెండో పంటకు సాగుకు సిద్ధమవుతున్నారు. చివరి రైతులకు ఒక పంట కూడా రావడం అనుమానంగా కన్పిస్తోంది. కొన్ని రోజుల్లో నీరు అందకపోతే లక్షఎకరాల్లో సాగు ప్రశ్నార్థకంగా మారనుంది. ఏటా సాగునీటి సమస్య ఉత్పన్నమవుతున్నా చాలా మంది రైతులు స్వల్ప నీరు అవసరమయ్యే నేరువరి విత్తు పద్ధతిపై మొగ్గారు. వీరికి కాలువ నీరు రాక, ఆశించినంత వాన పడక దిక్కుతోచడం లేదు. గతేడాది జలాశయం నిండలేదు. ఈసారి భారీగా వరదలు వచ్చాయి. ఈ దఫా డ్యామ్‌లో పుష్కలంగా నీరు ఉన్నాయి. నీటి నిర్వహణలో వైఫల్యం కారణంగా నష్టపోతున్నారు. చాలా మంది తొలి పంటపై ఆశలు వదిలేసుకుంటున్నారు. రాయచూరు, రాయచూరు గ్రామీణ, మాన్వి ఎమ్మెల్యేలు గంభీరంగా తీసుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు.

జిల్లా సర్వతోముఖాభివృద్ధికి కృషి



వసంత్‌కుమార్‌ను సత్కరిస్తున్న ప్రముఖులు

రాయచూరు, న్యూస్‌టుడే : జిల్లా సమగ్ర అభివృద్ధికి శ్రమిస్తానని ఎమ్మెల్సీ వసంత్‌కుమార్ భరోసా ఇచ్చారు. సమస్యలను మంత్రుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. పదవీ కాలం ముగిసే వరకు జిల్లాలోని సమస్యలపై శాసనమండలిలో గళం విప్పుతానని హామీ ఇచ్చారు. రాగూర్ స్మారక విద్యా సంస్థ ఉపాధ్యక్షుడైన వసంత్‌కుమార్ ఎమ్మెల్సీ అయిన నేపథ్యంలో శనివారం విద్యా సంస్థ సభాభవన్‌లో ఆయన్ను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయాల్లోకి ప్రవేశించాలన్న ఆసక్తి తనలో ఉండేది కాదని, మాజీ ఎమ్మెల్యే పాపారెడ్డి చొరవతోనే చేరినట్లు తెలిపారు. 1984 నుంచి కాంగ్రెస్‌లో క్రమశిక్షణ కల్గిన కార్యకర్తగా పని చేస్తూ, ఎన్నో ఒడిదొడుకులను అధిగమించి మండలి సభ్యుడైనట్లు వివరించారు. విద్యా సంస్థ అధ్యక్షుడు ఆర్.కె.అమరేశ్ మాట్లాడుతూ కఠోర శ్రమతోనే వసంత్ అంచెలంచెలుగా ఎదిగారని ప్రశంసించారు. కాంగ్రెస్ నాయకుడు కె.శాంతప్ప మాట్లాడుతూ అణగారిన వర్గాల ప్రజలకు సామాజిక న్యాయం కోసం అనేక పోరాటాలు చేశారని కొనియాడారు. పార్టీ ఏ బాధ్యత అప్పగించినా క్రియాశీలకంగా పనిచేయడం వల్లే కీలక పదవి దక్కిందని తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి బసవరాజ పాటిల్ దరూర, కార్యదర్శి జగదీష్ గుప్తా, స్వామీజీ శాంతమల్ల శివాచార్యులు, ప్రిన్సిపల్ టి.అరుణకుమారి, అధ్యాపకులు సవితా, బసవంతరాయ పాటిల్ పాల్గొన్నారు.

చాముండి కొండపై నిషేధాజ్ఞలు జారీ

మైసూరు, న్యూస్‌టుడే : చారిత్రక చాముండి బెట్టపై మహిష దసరా, మండలోత్సవాలను ఆచరిస్తామని కొన్ని సంఘాలు పిలుపునిచ్చిన నేపథ్యంలో నగరం, బెట్టపై నిషేధాజ్ఞలను జారీ చేస్తూ కమిషనర్ సీమా లాట్కర్ ఆదేశాలు జారీ చేశారు. శనివారం అర్ధరాత్రి నుంచే నిషేధాజ్ఞలు అమలులోకి వచ్చాయి. సోమవారం ఉదయం ఆరు గంటల వరకు నిషేధాజ్ఞలు కొనసాగుతాయని ఆమె ప్రకటించారు. టౌన్‌హాల్ ఆవరణలో మాత్రమే మహిష మండలోత్సవాలను నిర్వహించుకునేందుకు అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు.

5న మాన్వికి ముఖ్యమంత్రి సిద్ధరామయ్య రాక



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి బోసురాజు

మాన్వి, న్యూస్‌టుడే : ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తొలిసారి మాన్వికి వస్తున్నారు. అక్టోబర్ 5న సీఎం మాన్వి పర్యటన ఖరారైంది. మంత్రి ఎన్.ఎస్. బోసురాజు శనివారం సాయంత్రం మాన్వి, సిరివార తాలూకాల అధికారులతో అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. ఉభయ తాలూకాల్లో చేపట్టిన పనుల ప్రగతిని పరిశీలించారు. శంకుస్థాపన చేయాల్సిన పనులు, ప్రభుత్వ అనుమతుల కోసం ఎదురు చూస్తున్న పనులు, టెండర్ ప్రక్రియ ముగిసిన పనుల విషయమై ఆయన అధికారులతో సమీక్ష చేశారు. భారత్ జోడో కాంగ్రెస్ కార్యాలయంలో కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రముఖులతో సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి సిద్దరామయ్య మాన్వి పర్యటన, ప్రభుత్వంపై భాజపా చేస్తున్న దుష్ప్రచారాన్ని విశ్వసించరాదని మంత్రి వివరించారు. కార్మికులు పిల్లలను విద్యావంతులను చేయాలని సూచించారు. పురపాలక సంఘం కార్మికులు, వారి పిల్లలను మంత్రి సత్కరించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అబ్దుల్ గఫూర్‌సాబ్, మెకో సంస్థ అధ్యక్షుడు ఎం. ఈరణ్ణ, శాంతప్ప, ముఖ్యాధికారి గంగాధర్, దేవదుర్గ సంఘం ముఖ్యాధికారి హంపయ్య, పురపాలక సంఘం సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య పోరును మలుపు తిప్పిన యోధుడు



జయంతి సభలో మాట్లాడుతున్న వీరేశ్, తదితరులు

రాయచూరు, న్యూస్‌టుడే : ఏఐడీఎస్ఓ, ఏఐడీవైఓ, ఏఐఎంఎస్ఎస్ సంయుక్తంగా శనివారం ఇక్కడి భగత్‌సింగ్ కూడలి వద్ద స్వాతంత్ర్య సమర యోధుడు భగత్‌సింగ్ జయంతిని ఘనంగా జరుపుకున్నాయి. ఆయన చిత్రపటానికి కార్మిక నాయకుడు ఎన్.ఎస్.వీరేశ్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటాన్ని భగత్‌సింగ్ మలుపు తిప్పారని, ఆయన పోరాట స్ఫూర్తి, ప్రాణత్యాగం ఎందరో వీరులను పోరుబాటపై మళ్లించిందని వివరించారు. ఉరితాడు మెడకు చుట్టుకుంటున్నా.. ముఖంలో ఏ మాత్రం భయం కన్పించని ధైర్యశాలి అని పేర్కొన్నారు. పరాయి పాలన నుంచి విముక్తి పొందాక సమసమాజ స్థాపన జరిగితేనే దేశానికి నిజమైన స్వాతంత్ర్యం లభించినట్లని కలలు కన్నారన్నారు. వాటిని సాకారం చేయటానికి ప్రభుత్వాలపై పోరాటాలు చేద్దామని పిలుపునిచ్చారు. ఏఐడీవైఓ జిల్లా కార్యదర్శి వినోద్ మాట్లాడుతూ భగత్‌సింగ్ చివరి వరకు రాజీలేని పోరాటాన్ని కొనసాగించారని తెలిపారు. కులాలు, మతతత్వ విధానాలను వ్యతిరేకించారని, సామాజికంగా అనేక మార్పులు జరగాలని ఆకాంక్షిచారన్నారు. కార్యక్రమంలో సంఘాల ప్రతినిధులు బసవరాజ్, పీర్‌సాబ్, అమోఘ్, శివప్ప, మౌనేశ్ నాయక్, నాగవేణి పాల్గొన్నారు.

కనుల పండువగా సాయిబాబా జయంతి



సాయిబాబా విగ్రహానికి పూజలు చేస్తున్న భక్తులు

మాన్వి, న్యూస్‌టుడే : పట్టణంలోని ఆర్‌జీక్యాంపు రోడ్డులోని శిరిడి సాయిబాబా జయంతి ఘనంగా నిర్వహించారు. తెల్లవారు జామున కాకడ హారతితో జయంత్యుత్సవ వేడుకలను ప్రారంభించారు. జాలాపూర్(శ్రీనగర్)క్యాంపునకు చెందిన ఎం.సుబ్రహ్మణ్యం సుజాత, ఎం.శ్రీనివాస్ గీతా దంపతుల ఆధ్వర్యంలో సాయిబాబా ఉత్సవ విగ్రహాలకు అభిషేక పూజలు ఆలయ అర్చకులు సాయిప్రసాద్ పర్యవేక్షణలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మాన్వి, సిరివార తాలూకాల వివిధ క్యాంపుల నుంచి తెలుగు ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వివిధ పార్టీలకు చెందిన ప్రముఖులు, సంఘ సంస్థల నిర్వాహకులు, అధికారులు జయంత్యుత్సవానికి హాజరయ్యారు. భక్తులకు విశేష అన్నసంతర్పణ చేశారు. సాయి సేవాసమితి, తిరుమల తిరుపతి భక్తుల సేవా సమితి, ఆలయ సేవా సమితుల ఆధ్వర్యంలో భక్తులకు సేవలందించారు.

గాంధీ జయంతిని విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న శివానంద

రాయచూరు, న్యూస్‌టుడే : గాంధీ జయంతిని విజయవంతం చేయాలని జిల్లా అదనపు పాలనాధికారి శివానంద అధికారులకు సూచించారు. అక్టోబర్ 2న బాపు జయంతి నిర్వహణపై శనివారం జిల్లా పాలనాధికారి సభాప్రాంగణంలో సన్నాహక సమావేశం జరిగింది. అధ్యక్షత వహించిన శివానంద మాట్లాడుతూ సర్వధర్మ ప్రార్థన, భజనలు నిర్వహించాలని, శ్రమదానం చేయాలని కోరారు. అహింస, అంటరానితనం నిర్మూలనం, మద్యపానం వల్ల కలిగే అనర్థాల గురించి ప్రజలను చైతన్య పరచాలని, స్వదేశీ వస్తువులు వినియోగించేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. గాంధీ జీవనం, స్వాతంత్ర పోరాటంలో ఆయన పాత్ర, సామాజిక సమస్యలపై స్పందించిన తీరుపై విద్యార్థులకు పోటీలు పెట్టాలని, జయంతి రోజున విజేతలకు బహుమతులను ప్రదానం చేయాలని సూచించారు. ఆ రోజు ఉదయం 7 గంటలకు జిల్లా పాలనాధికారి కార్యాలయం వద్ద స్వచ్ఛత నడక మొదలై. . బసవేశ్వర కూడలి మీదుగా జిల్లా క్రీడా మైదానానికి చేరుకుంటుందని వివరించారు. 8 గంటలకు పతాకావిష్కరణ జరుగుతుందని, 9 గంటలకు వ్యవసాయ విజ్ఞాన విశ్వ విద్యాలయం ఆవరణలో స్వచ్ఛతా పనులు ప్రారంభమవుతాయన్నారు. 11 గంటలకు అహింసా ప్రతిజ్ఞ చేయిస్తారని వివరించారు. జయంతి కార్యక్రమాల్లో అన్ని వర్గాల ప్రజలను భాగస్వామం చేయాలని కోరారు. కన్నడ, సాంస్కృతిక శాఖ సహాయక నిర్దేశకుడు దత్తప్ప సాగూరు, పౌర సంబంధాలశాఖ అధికారి లింగరాజ్, రమేష్ గౌడూరు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ సేవలు శ్లాఘనీయం



విద్యార్థినికి కిట్ అందిస్తున్న ప్రిన్సిపల్ సుగుణ

రాయచూరు, న్యూస్‌టుడే : ఎన్‌ఎస్‌ఎస్ చేస్తున్న సామాజిక సేవలు స్ఫూర్తిదాయకమని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సుగుణ పేర్కొన్నారు. కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విభాగం విద్యార్థినులు ఈనెల 17 నుంచి పట్టణం, తాలూకా గ్రామాల్లోని వివిధ ప్రాంతాల్లో శ్రమదానం చేస్తున్నారు. కళాశాలలో శనివారం జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ స్వచ్ఛంద సేవకులకు టోపీలు, చేతి గ్లౌసులు, డైరీలు, పెన్నులు కల్గిన కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కోటలు, స్మారకాలు, ఉద్యానవనాలు, బస్టాండ్, చెరువులు, దేవస్థానాల వద్ద స్వచ్ఛతా పనులు చేసినందున ఆ ప్రాంత రూపురేఖలు మారిపోయాయని హర్షం వ్యక్తం చేశారు. ఇందులో ప్రజలను భాగస్వామం చేయడం అభినందనీయమన్నారు. అక్టోబర్ 2 తర్వాత సెలవు రోజు పరిశుభ్రతా పనులు చేయాలని కోరారు. అధ్యాపకుడు, ఎన్‌ఎస్‌ఎస్ అధికారి డాక్టర్ సంతోషకుమార్ రేవురి మాట్లాడుతూ ప్రజలు సహకరిస్తున్నందునే విజయవంతంగా చేస్తున్నట్లు తెలిపారు. ప్లాస్టిక్ సామాగ్రి వాడవద్దని, మొక్కలను పెంచాలన్న సూచనలకు ఉత్తమ స్పందన లభించిందని చెప్పారు.

ఆకలి కేకలు బాధాకరం



మాట్లాడుతున్న న్యాయమూర్తి శివరాజ్ వి సిద్దేశ్వర

మాన్వి, న్యూస్‌టుడే : దేశ విదేశాల్లో ఇప్పటికీ ఆకలి కేకలు వినిపించటం బాధాకరమని న్యాయమూర్తి శివరాజ్ వి సిద్దేశ్వర పేర్కొన్నారు. తాలూకా పంచాయతీ సభాప్రాంగణంలో కానూను అరివు నెరవు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. పిల్లలు, గర్భిణులకు పోషక ఆహారం అందించాలన్నారు. ప్రభుత్వం అంగన్‌వాడీల ద్వారా పిల్లలు, మహిళలకు పోషక ఆహారాన్ని అందిస్తుందన్నారు. ఆకుకూరలు, పండ్లలో ఉన్న పోషకాలను తెలుసుకుని వాటిని వినియోగించుకోవాలని తెలిపారు. సమావేశంలో శిశు అభివృద్ధి యోజనాధికారి మన్సూర్ అహ్మద్, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు రవికుమార్, న్యాయవాదులు మనోహర్ విశ్వకర్మ, గుమ్మ బసవరాజ్, యల్లప్ప, దత్తాత్రేయ, ఈశప్ప, మల్లేశ్ మాచనూరు, విశ్వనాథ్ పాటిల్, మహిళా సంఘాల సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

మల్లదగుడ్డలో విశ్వ రేబిస్ దినోత్సవం

మాన్వి, న్యూస్‌టుడే : కుక్కలు, ఇతర జంతువులు కరిచినా, గోళ్లతో రక్కినా వెంటనే చికిత్స తీసుకోవాలని లేని పక్షంలో అవి ప్రాణాల మీదకు వస్తుందని తాలూకా ఆరోగ్య శిక్షణాధికారి బాలప్ప నాయక్ అన్నారు. శనివారం మల్లదగుడ్డ గ్రామంలో విశ్వ రేబిస్ దినోత్సవాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. రేబిస్ వైరస్ ద్వారా సోకుతుందన్నారు. వ్యాధి సోకిన ప్రాణుల నోటి నుంచి కారే చొంగ, అవి మనుషులను నాకడం ద్వారా రేబిస్ సోకుతుందన్నారు. కార్యక్రమంలో ప్రతినిధులు అమరేశప్ప, సూగనగౌడ, ముదుకప్ప, బసనగౌడ, వీరభద్రయ్యస్వామి, అమరయ్యస్వామి, విరుపాక్షయ్యస్వామి, శ్రీదేవి, హంపమ్మ తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఆరోగ్యశాఖ అధికారులు

ఐజాపురలో అక్షరాస్యతపై ప్రత్యేక శిబిరం

రాయచూరు, న్యూస్‌టుడే : ఎల్‌వీడీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో రాయచూరు తాలూకా ఐజాపుర గ్రామంలో భారత్ కోసం యువకులు, డిజిటల్ అక్షరాస్యత అనే అంశాలపై ఐదు రోజుల ప్రత్యేక శిబిరాన్ని నిర్వహించారు. ప్రజలతో కలసి గ్రామంలో స్వచ్ఛత పనులు చేశారు. విద్యాలయ మండలి కార్యదర్శి జట్టం శ్రీనివాస్, ప్రిన్సిపల్ శరణగౌడ, రాజనీతి విభాగం ముఖ్యుడు డాక్టర్ కృష్ణానాయక్, ఉపన్యాసకుడు శరణగౌడ, ప్రభుత్వ పాఠశాల ఎస్‌డీఎంసీ అధ్యక్షుడు రాఘవేంద్ర, ఎన్ఎస్ఎస్ అధికారి రాజజబ్బార్ బాబా రాథోడ్ పాల్గొన్నారు.

30న కేడీపీ సమావేశం

రాయచూరు, న్యూస్‌టుడే : రాయచూరు తాలూకా పంచాయతీ నాల్గో త్రైమాసిక కేడీపీ సమావేశాన్ని ఈ నెల 30న నిర్వహిస్తున్నారు. ఉదయం 10 గంటలకు జిల్లా పంచాయతీ సభాప్రాంగణంలో ప్రారంభమవుతుంది. రాయచూరు గ్రామీణ నియోజకవర్గం శాసనసభ్యుడు బసనగౌడ దద్దల్ అధ్యక్షత వహిస్తారు. ఆయా శాఖల ముఖ్య అధికారులు అభివృద్ధికి సంబంధించిన దాఖలాలతో తప్పక హాజరు కావాలని అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.

కాలిపోయిన కారు

మంగళూరు : అడ్యారు సహ్యాద్రి కళాశాల సమీపంలో శనివారం విలాసవంతమైన బీఎండబ్ల్యూ కారులో మంటలు చెలరేగాయి. కారు నడుపుతున్న గురుదీప్ తక్షణమే కిందకు దిగి మంటలు ఆర్పేందుకు విఫలయత్నం చేశారు. దిల్లీ రిజిస్ట్రేషన్ ఉన్న కారును గురుదీప్ మంగళూరులో వినియోగించుకుంటున్నారు. ఇంజిన్‌లో షార్ట్ సర్క్యూట్‌తో ఈ ఘటన చోటు చేసుకుందని ప్రాథమిక దర్యాప్తులో గుర్తించారు.

అప్పులబాధతో ఆత్మహత్య

రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే: అప్పుల బాధతో కర్ణాటకకు చెందిన ఓ వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. సికింద్రాబాద్ జీఆర్పీ పోలీసుల వివరాల ప్రకారం... బీదర్ జిల్లా మెడ్‌పల్లికి చెందిన జగన్నాథ్(49)కు భార్య, నలుగురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. వ్యవసాయం చేసే ఇతను బ్యాంకు నుంచి పంట రుణం తీసుకున్నాడు. సొంతూరులో వ్యవసాయం చేసుకుంటూనే ఘట్‌కేసర్ బాలాజీనగర్‌లో ఉంటూ కంకులు విక్రయిస్తున్నాడు. సాగులో లాభాలు రాక, అప్పులు పెరిగిపోవడంతో శుక్రవారం ఘట్‌కేసర్-బీబీనగర్ స్టేషన్ల మధ్య దానాపూర్ ఎక్స్‌ప్రెస్ కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు.

తుంగభద్ర జలాశయం నీటిమట్టం

పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు

28-09-2024 (ఉ॥ 8 గంటలకు)	ప్రస్తుతం	గత సంవత్సరం
నీటిమట్టం (అడుగుల్లో)	1632.00	1618.79
ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	22,513	881
అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	14,408	9,549
నీటి నిల్వ (టి.ఎం.సి)	101.773	57.999

గరిష్ఠసామర్థ్యం (133 టీఎంసీలు) వాస్తవసామర్థ్యం 105.788 టీఎంసీలు

‘సుప్రీంకోర్టు తీర్పు అమలు చేయాలి’



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న నేతలు

మాన్వి, న్యూస్‌టుడే : ఎస్సీ వర్గీకరణ రిజర్వేషన్ అమలు చేయాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినా ప్రభుత్వం స్పందించకపోవటం దారుణమని వివిధ దళిత సంఘాల సభ్యులు ఆరోపించారు. శనివారం స్థానిక పత్రికాభవనంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఏబీసీడీ వర్గీకరణకు ప్రభుత్వమే న్యాయమూర్తి సదాశివ సమితిని నియమించిందన్నారు. సమితి నివేదికను అమలు చేయటంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందన్నారు. సుప్రీంకోర్టు కూడా వర్గీకరణకు అనుకూలంగా తీర్పు చెప్పిందన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చొరవ చూపారని, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే దీన్ని అడ్డుకున్నారన్నారు. అక్టోబర్ 2లోపు ప్రభుత్వం స్పందించకుంటే 3న రాష్ట్ర వ్యాప్తంగా బంద్ పాటిస్తామన్నారు. అక్టోబర్ 3న మాన్విలో బంద్ చేస్తామన్నారు. పట్టణ ప్రజలు, వ్యాపారులు, శిక్షణ సంస్థల నిర్వాహకులు బంద్‌కు సహకరించాలని కోరారు. సమావేశంలో ప్రతినిధులు జయరాజ్, యల్లప్ప బాదరదిన్ని, ప్రభురాజ్‌కొడ్లి, తాయప్ప, మౌనేశ్,మల్లేశ్, మూకప్ప కట్టిమని తదితరులు పాల్గొన్నారు.

మెట్రో కొత్త మార్గం సిద్ధం



పొడిగింపు మార్గంలో సంచరిస్తున్న ఆకుపచ్చ మెట్రో రైలు

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : నమ్మ మెట్రో వ్యవస్థ పొడిగింపు మార్గం నాగసంద్ర- మాదావర మధ్య 3.7 కిలో మీటర్ల పొడవునా ఉపరితల వంతెనపై అక్టోబరు మొదటి వారంలో రైలు పరుగులు తీయనుంది. ఇదే వాస్తవరూపం దాల్చితే ఉత్తర- దక్షిణ కారిడార్ మార్గం పొడవు 33.6 కిలోమీటర్లకు విస్తరించనుంది. సంచార రద్దీగా ఎక్కువగా ఉండే తుమకూరు రహదారిలో ఉపరితల వంతెనపై మెట్రో రైలు సంచారం మొదలైతే రాకపోకలు మరింత సులువు కానున్నాయి. ఇప్పటికే నెల రోజులుగా ఈ రైలు ప్రయోగాత్మకంగా పరుగులు తీసింది. దీని నిర్వహణ సజావుగా ఉన్నట్లు నిపుణులు సంతృప్తి వ్యక్తం చేశారు. కేంద్ర మెట్రో రైలు సురక్షిత ప్రాధికార కమిషనర్ ఎ.ఎం.చౌదరి నేతృత్వంలోని సాంకేతిక నిపుణులు అక్టోబరు 3న నగరానికి వచ్చి మరోసారి పరీక్షించాక ప్రయాణికులకు సేవలకు అనుమతిస్తారని బీఎంఆర్‌సీఎల్ అధికారులు తెలిపారు. 2017లో నాగసంద్ర- మాదావర మధ్య మెట్రో నిర్మాణ పనులు ప్రారంభించారు. అనేక కారణాలతో పనుల్లో జాప్యం ఎదురైంది. నిర్మాణానికి రూ.248 కోట్లు వ్యయం చేశారు. మంజునాథ్‌నగర, చిక్కబిదరకల్లు, మాదావర ప్రయాణ ప్రాంగణాలు ఇందులో భాగం. బెంగళూరు అంతర్జాతీయ వస్తు ప్రదర్శనశాలకు వెళ్లే సందర్శకులకు మెట్రో రైలు అనుకూలం కానుంది. నెలమంగల, తుమకూరు ప్రాంతాలకు వేగంగా చేరుకోవడానికి ఉపకరించనుంది.

హామీలను విస్మరిస్తున్న ప్రభుత్వాలు



సమ్మేళనాన్ని ప్రారంభిస్తున్న బసవరాజ్

మాన్వి, న్యూస్‌టుడే : ప్రభుత్వాలు హామీలిచ్చి విస్మరిస్తున్నాయని కర్ణాటక రాష్ట్ర గ్రామ పంచాయతీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కోశాధికారి ఆర్.ఎస్.బసవరాజ్ విమర్శించారు. శనివారం స్థానిక ఈద్గా ఫంక్షన్ హాల్లో జిల్లా గ్రామ పంచాయతీ ఉద్యోగుల సంఘం జిల్లా సమ్మేళనాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలో 65 వేల మంది గ్రామ పంచాయతీల్లో విధులు నిర్వహిస్తున్నారని, ప్రజలకు సేవలందిస్తున్న వీరిని ప్రభుత్వ విస్మరించిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిత్యావసర ధరలను పెంచుతున్నాయని, అందుకు తగిన విధంగా జీతాలు పెరగడం లేదన్నారు. మారుతి మాన్పడే, సీతారాం ఏచూరి చిత్రపటాలకు నివాళులర్పించారు. పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. సమ్మేళనం సందర్భంగా రెడ్‌ఫ్లాగ్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రముఖులు ఆంజనేయనాయక్, పద్మా, శరణబసవ, హెచ్.శర్ఫుద్దీన్, గిరియప్ప, అక్తర్‌పాషా, వీరనగౌడ, సురేష్, బసవరాజ్‌గౌడ, శివరాజ్‌స్వామి, కార్మిక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

రాయచూరు, న్యూస్‌టుడే : ప్రపంచ హృదయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం రాయచూరులోని విజయపాలి క్లినిక్, నర్సింగ్ హోమ్‌లో ఉచిత ఆరోగ్య పరీక్షల శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు ఆసుపత్రి వైద్యుడు అజిత్ కులకర్ణి ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు గుండెకు సంబంధించిన పరీక్షలు చేస్తారు. నగర ప్రజలు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చిన్నారులు, యువత, మధ్య వయసు వారు గుండె రోగాల బారిన పడుతున్నందున ఏడాదికి ఒకసారి పరీక్షలు చేయించుకోవాలని ఆయన సూచించారు.